

## బ్రహ్మర్షి పత్రీజీ

# ఆత్మక్షేత్రం

# " ఆత్మక్షేత్రం "

" అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥ "

**ఆ**త్మక్షేత్రం గురించి మొత్తం చెప్పి ఉన్నారు శ్రీకృష్ణులవారు ! ఈ శ్లోకం యొక్క అర్థాన్ని తెలుసుకుందాం... ***" అహం ఆత్మా గుడాకేశ ! "***... " ఓ అర్జునా ! ఓ గుడాకేశా ! నేను **ఆత్మ** ను నాయనా ! "

అర్జునుడు కృష్ణుడ్ని అడిగాడు " ఎవరివయ్యా నువ్వు? " అని. కృష్ణుడు చెప్పాడు " నేను ఆత్మను నాయనా ! I am the Consciousness ".

ఆత్మ అంటే గుర్తుంచుకోండి – నేను అనే ఎరుక. నేను, నేను అంటాం కదా ! చిన్నప్పుడూ నేనే ! అయిదేళ్ళ వయస్సులోనూ నేనే ! పదేళ్ళ వయస్సులోనూ నేనే ! ఇరవైఏళ్ళ వయస్సులోనూ నేనే ! నలభైఏళ్ళ వయస్సులోనూ నేనే ! ఇప్పుడూ నేనే! నా శరీరం మారింది. అయిదేళ్ళ నుంచి, పదేళ్ళ నుంచి, ఇరవైఏళ్ళ నుంచి, నలభైఏళ్ళ నుంచి నా శరీరం మారుతోంది ! కానీ నేను మాత్రం మారలేదు.

నేను ఇంకా కొన్ని సంవత్సరాల తర్వాత ఇంకా ముసలివాణ్ణి అయిపోతాను. మరి కొన్ని సంవత్సరాల తర్వాత ఈ శరీరం శిథిలమైపోతుంది. వదిలిపెట్టేస్తాను నేను ఈ శరీరాన్ని.

నేను 2095 సంవత్సరంలో వదిలిపెట్టేయదలచుకున్నాను. అప్పుడు నా శరీరం అలా పడుకుంటుంది. **ఆత్మ**... అలా... బయటికి వస్తుంది.

**ఆత్మ** అన్నది శరీరం లోంచి బయటికి వచ్చేసి, " అరే ! నేను అక్కడ పడుకున్నాను కదా ! నేనిక్కడ ఎలా ఉన్నాను? " అనుకుంటుంది. సరే, లేచి వెళ్దామంటే శరీరం కదలదు. కాలు కదపలేము. చేయి కదపలేము. ఆ శరీరానికీ మనకూ మధ్యన సంబంధం తెగిపోయింది. ఆ శరీరం బయట ఉండి **నేను** అని ఆలోచిస్తున్నాను. " నా పెళ్ళాం ఏం చేస్తోంది ఇప్పుడు ? నా మొగుడు ఏం చేస్తున్నాడు ? నా పిల్లలు ఏం చేస్తున్నారు ? "... అంటే, నేను అనేది శరీరం బయట ఉండి ఆలోచిస్తోంది. ఆ **నేను** అనేదే **ఆత్మ** అని... ఆధ్యాత్మిక శాస్త్రం పరిభాషలో దాని యొక్క అర్థం.

" నువ్వు ఎవరు నాయనా ? కృష్ణా ! నాకు నువ్వు అర్థం కావటం లేదు ! నువ్వు చెప్పేది ఏం అర్థం కావటం లేదు ! "... అని అర్జునుడు అడిగాడు.

★ ★ ★

అర్జునుడికి కృష్ణుడు చెప్పింది అర్థం అయ్యిందా ! కాజాలదు ! అర్థం కాకపోవడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు !

కనుక, ఇది ఈ ఆత్మను, దాని చేతల గురించి తెలుసుకోవడమనేది " కొంత జటిలమైనది " – " కొంత జటిలమైనది కాదు ". తెలుసుకోవడానికి ఇష్టం లేకపోతే " జటిలమైనది ". తెలుసుకోవడానికి ఇష్టముంటే అది " సుసాధ్యం ".

సంగీత క్షేత్రముంది. క్రికెట్ క్షేత్రముంది. హాకీ క్షేత్రముంది. ప్రతి ఆట కూడానూ... అదొక పెద్ద క్షేత్రం. సంగీతం నేర్చుకోవాలంటే మరి దానికి మన యొక్క సంసార క్షేత్రం నుంచి బయటకి వచ్చి సంగీత క్షేత్రం లోకి రావాలి. " నేను సంసార క్షేత్రంలో ఉన్నాను. నా పెళ్ళాం, బిడ్డలు ఉన్నారు. నేనెలా సంగీతం నేర్చుకుంటాను ? " అంటే, నువ్వెలా నేర్చుకుంటావు ? ఒక క్షేత్రంలో నుంచి ఇంకొక క్షేత్రం లోకి వెళ్ళాలంటే ఆ క్షేత్రం నుంచి బయటికి రావాలి కదా ! శరీర క్షేత్రం నుంచి బయటికి వస్తేనే ఆత్మక్షేత్రం మనకి సువిదితమవుతుంది !

★ ★ ★

శరీర క్షేత్రంలో ఉంటూనే, ఆత్మక్షేత్రం గురించి తెలుసుకోవాలంటే అది మనకు అర్థం కాదు.

మనం శరీర క్షేత్రంలో వుండి " నేను రెండు కాళ్ళు, నేను రెండు చేతులు, ఒక పొట్ట, ఒక ఉదరం, ఒక మొండెం, ఒక తలకాయ. ఇదంతా శరీరక్షేత్రం. నాకు రెండు కళ్ళున్నాయి. ఒక ముక్కు ఉంది. ఇంకా కొంత లోపలికి పోతే నాకొక గుండె ఉంది. ఒక లివర్ ఉంది. రెండు లంగ్స్ ఉన్నాయి. ఒక పాంక్రియాస్ ఉంది. పెద్ద ప్రేగు ఉంది. చిన్న ప్రేగు ఉంది. స్కెలిటన్ సిస్టమ్ ఉంది. మజిల్స్ సిస్టమ్ ఉంది. నెర్వస్ సిస్టమ్ ఉంది. రెండు కిడ్నీలు ఉన్నాయి..." అంటే ఇదంతా కూడానూ శరీరక్షేత్రం.

ఈ శరీరక్షేత్రం యావత్తు నుంచి విడివడితేనే ఆత్మక్షేత్రం మనకు అవగతం అవుతుంది. కేవలం శరీర క్షేత్రంలో ఉంటూంటే ఆత్మక్షేత్రం ఎంతమాత్రం అర్థం కాదు.

★ ★ ★

ఒక చిన్నిపిల్లవాడు ఉన్నాడు. ఆ పిల్లవాడి తండ్రి ఉన్నాడు. ఆ తండ్రి ఎన్నో ఇక్కట్లు పడి, ఎన్నో కష్టాలు పడి ఆ పిల్లవాడిని సాకుతున్నాడు. ఆ పిల్లవాడికేం తెలుసు తన తండ్రి ఎంత కష్టపడుతున్నాడో ? ఆ పిల్లవాడు ఆడుకుంటూ ఉంటాడు. వాడు అడుగుతాడు – " నాకు చాక్‌లెట్ కావాలి... ఐస్‌క్రీమ్ కావాలి ". ఆ పిల్లవాడికి " తండ్రి ఎలా తీసుకువస్తాడు ? " అని ఆ " తండ్రి గురించి " ఏమీ తెలియదు. ఆ కుర్రవాడికి కావల్సిందల్లా ఆ చాక్‌లెట్.

ఈ పిల్లవాడు కూడా తండ్రి అయినప్పుడు, అంత పెద్దవాడైనప్పుడు... అప్పుడు వాడికి తెలుస్తుంది... చిన్నప్పుడు తన తండ్రి ఎన్ని కష్టాలు పడి సాకాడో ! లేకపోతే చిన్నప్పుడే అంతా అర్థం అయిపోతుందేమిటి? ఈ చిన్నపిల్లవాడు **పెద్దపిల్లవాడు** అయితే కానీ, ఒకానొక **తండ్రి** గురించి, ఆ యొక్క **తండ్రి** గురించి, **తండ్రి తత్వం** గురించి తెలియదు ! **తల్లి** గురించి, **తల్లి తత్వం** గురించి తెలియదు. తల్లి గురించి, తల్లి తత్వం గురించి తెలుసుకోవాలంటే ఈ పిల్లవాడు ఎదగాలి.

అలాగే ఆత్మతత్వం గురించి తెలుసుకోవాలంటే... ఆత్మ సత్యం గురించి తెలుసుకోవాలంటే... ఆత్మక్షేత్రం గురించి తెలుసుకోవాలంటే, ఈ శరీర క్షేత్రంలో

ఉన్న మానవుడు బాగా ఎదగాలి. ఎదగకుండా **ఆత్మ** యొక్క పేరు ఊరు ఎలా తెలుసుకుంటాడు ? చిన్నప్పుడు వాడికి కోపం వస్తుంది. వాడి తండ్రి చాక్‌లెట్ ఇవ్వలేదు. వాడు ఏడుస్తాడు. వాడికేం తెలుసు ? " చాక్‌లెట్ కావాలి, ' డాడీ ' ఇవ్వలేదు " అంతే తెలుస్తుంది వాడికి. అయితే ఆ చిన్నపిల్లవాడు కరెక్ట్ ! ఆ చిన్నపిల్లవాడిది ఏ మాత్రం తప్పులేదు !

అలాగే ఆత్మక్షేత్రంలో ప్రవేశించనివాళ్ళు... వాళ్ళది ఏ మాత్రం తప్పులేదని... ఆత్మక్షేత్రంలో ప్రవేశించిన వారందరూ తెలుసుకుందురు గాక ! చిన్నపిల్లవాడి తత్వం చిన్నపిల్లవాడి లాగానే ఉంటుంది. శరీరం మాత్రమే నేను అనుకునే వాళ్ళ యొక్క తత్వం ఆ విధంగానే ఉంటుంది. మనిషి యొక్క ఆత్మతత్వం, **తల్లి** అంటే ఏమిటో, **తండ్రి** అంటే ఏమిటో, **బాధ్యత** అంటే ఏమిటో, ఆ **ఆప్యాయతలు** అంటే ఏమిటో, ఆ **సంరక్షణ** అంటే ఏమిటో... ఇవన్నీ ఏమీ తెలియవు. అయినా అన్నీ అందరూ పొందుతూనే ఉంటారు.

★ ★ ★

ప్రతి పిల్లవాడూ పెరిగి పెద్దయి తాను కూడా ఒక తండ్రి, తాను కూడా ఒక తల్లిగా అవటంలో ఎంతమాత్రం ఆశ్చర్యం లేదో, అదే విధంగా శరీర క్షేత్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ కూడానూ అచిరకాలంలో, అనుభవాల పరంపరలో, జన్మ పరిణామ క్రమంలో ప్రతి ఒక్కళ్ళు కూడానూ ఆత్మక్షేత్రంలో ప్రవేశించడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు !

★ ★ ★

ఆత్మక్షేత్రంలో ప్రవేశించినప్పుడు... అప్పుడు శరీర క్షేత్రంలో ఉంటాడు. శరీరంలో ఉంటాడు... రెండు కాళ్ళు, రెండు చేతులు, ఒక మొండెము ... ఇవన్నీ మారవు. కానీ శరీర క్షేత్రంలో ఉంటూనే ఆత్మక్షేత్రపు మనిషిగా ప్రతి పనీ చేస్తాడు. ప్రతి ఆలోచనా, ప్రతి మాట, ప్రతి పనీ... అది ఆత్మక్షేత్రం లోంచి వస్తుంది. శరీర క్షేత్రం నుంచి రాదు. ఎందుకంటే " తాను శరీర క్షేత్రం కాదు – ఆత్మక్షేత్రం " అని తెలుసుకున్నాడు. చూసేవాళ్ళకు తెలియదు – " ఇక్కడుండే మనిషి శరీరక్షేత్రంలో ఉన్నవాడా ? ఆత్మక్షేత్రంలో ఉన్నవాడా ? "... చూసేవాళ్ళకు తెలియదు.

★ ★ ★

అర్జునుడికి కృష్ణుడి గురించి ఎంతమాత్రం తెలియదు. భగవద్గీత చెప్పిన తర్వాత " పెద్దాయన చెప్పాడు కదా " అని యుద్ధం చేసాడు కానీ, ఆత్మ గురించి మాత్రం ఏమీ అర్థం కాలేదు, అర్జునుడికి. అర్థంగాక మరి అభిమన్యుడు చనిపోయినప్పుడు ఏడ్చాడు... " నా కొడుకును నువ్వే చంపించావు ! నువ్వు నన్ను అటు తీసుకెళ్ళావు. నీకన్నీ తెలుసు ! ఇటు తీసుకెళ్ళి ఉంటే చచ్చి ఉండేవాడు కాదు ! నా కొడుకును నువ్వే చంపావు ! " అని కృష్ణుడి గొంతు పట్టుకున్నాడు. పీక పట్టుకున్నాడు. ఏదో విధంగా ఆ పట్టు విడిపించుకున్నాడు కృష్ణుడు.

భగవద్గీత విన్న అర్జునుడికే భగవద్గీత అర్థం కాదు, అయినా చెప్పింది చేస్తాడు ! అది వేరే మాట ! కానీ అర్థం కాలేదు ! అర్థం కాజాలదు ! ఎప్పుడు అర్థం అవుతుంది ? తాను కూడా యోగీశ్వరుడు అయినప్పుడు ! తాను కూడా యోగి అయినప్పుడు ! అంటే అంత పెద్దగా కావాలి. అప్పుడు అర్థం అవుతుంది. పిల్లవాడు పెద్దవాడు అవ్వాలి.

ఒక మూడేళ్ళ పిల్లవాడు అడిగాడు తన తండ్రిని – " డాడీ, నేను ఎలా పుట్టాను ? " అని. ఆ తండ్రి ఏం చెప్తాడు కొడుక్కి ?! ఎలా విశదీకరిస్తాడు ?? " ఒక స్త్రీ ఒక పురుషుడిని కూడితే అందులోంచి శుక్ల శోణితాలు కలిసాయి " అని, ఏం చెప్తాడు మూడేళ్ళ పిల్లవాడికి ?

అప్పుడు ఏం చెప్తాడో తెలుసా ? " దేవుడు పుట్టించాడు! " అని. ఆ పిల్లవాడికి సత్యం చెప్పటం కష్టం... వాడింకా ఎదగాలి. అలాగే శరీర క్షేత్రంలో పూర్తిగా నిమగ్నమైన వాళ్ళకు చెప్పజాలము. అసంభవం ! ఇంపాజిబుల్ !... వాడే దీంట్లో ఇంట్రెస్ట్ చూపిస్తే తప్పితే. హిరణ్యకశ్యపుడికి ప్రహ్లాదుడు ఏమీ చెప్పలేకపోయాడు. హిరణ్యకశ్యపుడికి కోపం వచ్చింది. తన సొంత కొడుకును చంపించటానికి సిద్ధమయ్యాడు. శరీరక్షేత్రం అయిన హిరణ్యకశ్యపుడు ఆత్మక్షేత్రం కాజాలడు.

★ ★ ★

ఈ యొక్క ఆత్మక్షేత్రం శరీరక్షేత్రంలో ఉన్నవాళ్ళకు అర్థం కాదు. కానీ శరీర క్షేత్రంలో ఉన్నవారందరూ ఆత్మక్షేత్రానికి అలా అర్థం అవుతారు. హిరణ్యకశ్యపుడి సంగతి ప్రహ్లాదుడికి తెలుసు. ప్రహ్లాదుడి సంగతి హిరణ్యకశ్యపుడికి తెలియదు. హిరణ్యకశ్యపుడు శరీర క్షేత్రానికి ప్రతీక. ప్రహ్లాదుడు ఆత్మక్షేత్రానికి ప్రతీక. " ఈ

శరీరం నేను " అనుకునేవాళ్ళు " ప్రక్కవాడి శరీరాన్ని చంపేస్తాను" అంటాడు. అంటే హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుడ్ని చంపించటానికి ప్రయత్నం చేసాడు. కానీ అది... ఆత్మక్షేత్రం... చావదు. కొండ మీది నుంచి క్రిందపడేసినా ఆత్మక్షేత్రం చావదు. పాములతో కరిపించినా ఆత్మక్షేత్రం చావదు. ఏనుగులతో త్రొక్కించినా ఆత్మక్షేత్రం చావదు. చావలేదు. ప్రహ్లాదుణ్ణి, ఒక చిన్న కుర్రాణ్ణి ఆ అసుర బలులు, ఆ యొక్క రాక్షసులు, ఆ యొక్క హిరణ్యకశ్యపుడు చంపలేకపోయారు.

★ ★ ★

అంగుళీమాళుడు అందరినీ చంపేస్తున్నాడు. బుద్ధుడు అక్కడికి వెళ్ళాడు. బుద్ధుడిని " చంపేస్తా " నన్నాడు. కత్తిని ఆయన శరీరం లోంచి తిప్పాడు. ఏమీ కాలేదు. అది ఆత్మక్షేత్రం. ఇక్కడ శరీర క్షేత్రం. అంగుళీమాళుడు అన్నాడు – " నేను శరీరమే ! నువ్వూ శరీరమే ! నేను నిన్ను చంపేస్తా ! " అన్నాడు. చంపడం, చావటం... అది శరీరక్షేత్రం యొక్క ధర్మం. చంపకపోవటం, చావకపోవటం... అది ఆత్మక్షేత్రం యొక్క ధర్మం.

★ ★ ★

బుద్ధుడు ఎవ్వరినీ చంపడు. ఎందుకంటే " నేను వాణ్ణి చంపలేను " అని తెలుసుకుని ఉన్నవాడు. బుద్ధుడు ఆత్మక్షేత్రంలో ఉన్నవాడు. అందరిలో ఆత్మక్షేత్రం దర్శించినవాడు. " నేను ఎలా చంపుతాను వాణ్ణి ? ఇంపాజిబుల్ ! నేను వాణ్ణి చంపి ఏదైనా సాధిస్తాను అనుకోవటం అశాస్త్రీయమైన విషయం " అని తెలుసుకుని ఉన్నవాడు బుద్ధుడు. అంగుళీమాళుడు " నేను వాణ్ణి చంపేస్తాను " అన్నాడు. హిరణ్యకశ్యపుడు " నేను ప్రహ్లాదుణ్ణి చంపేస్తా " నని అన్నాడు. హిట్లర్ ఏమన్నాడు – " యూదులందర్నీ చంపేస్తా " అన్నాడు. అందర్నీ చంపేసాడు.

★ ★ ★

మై డియర్ ఫ్రెండ్స్ ! సీతాదేవి ఆత్మక్షేత్రం. అగ్నిలో ప్రవేశం చేయమన్నాడు రాముడు. లక్ష్మణుడు అన్నాడు – " అన్నా ! నువ్వు వదినను శంకిస్తున్నావా? నువ్వేనా శంకించేది పవిత్రమైన వదినను ? " అని కోపం వచ్చేసింది. లక్ష్మణుడు శ్రీరాముని మీద కోప్పడ్డాడు. తిట్టాడు. " నువ్వు ఇంత నీచుడవని అనుకోలేదు " అన్నాడు. " ఇన్నిరోజులు నీకు నేను సేవ చేసానా ? " రాముడు నవ్వాడు. రాముడు అర్థం

కాలేదు లక్ష్మణుడికి. అంతవరకు అర్థం అయ్యిందనుకున్నాడు లక్ష్మణుడు. అసలు అర్థమే కాలేదు లక్ష్మణుడికి రాముడు.

రాముడికి తెలుసు... సీత శరీర క్షేత్రం కాదు... ఆత్మక్షేత్రం అని చెప్పేసి. లక్ష్మణుడికి తెలియదు. సీతకు తెలుసు... తాను ఆత్మక్షేత్రమని. కనుక సంతోషంగా అగ్ని ప్రవేశం చేసింది.

**" నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః**
**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః "**

ఆత్మను శస్త్రాలు ఛేదింపవు. అగ్ని దహించదు. నీరు తడుపజాలదు. గాలి ఎండింపదు. సీతాదేవి అన్నది ఆత్మక్షేత్రం.

★ ★ ★

ఈ **రామాయణం** గానీ, **మహాభారతం** గానీ యోగీశ్వరులు ఎందుకు రచించారు ? ఈ రెండు విషయాల గురించి చెప్పటం కోసమే – " శరీరక్షేత్రం వేరే ! ఆత్మక్షేత్రం వేరే ! అయ్యా ! నువ్వు శరీరక్షేత్రం కాదు. నువ్వు ఆత్మక్షేత్రం ". అంటే సుస్పష్టంగా, క్రిస్టల్ క్లియర్‌గా వాల్మీకనే యోగీశ్వరుడు, లేదా వ్యాసుడనే యోగీశ్వరుడు రామాయణ, మహాభారతాల ద్వారా... ఆ యొక్క రచనల ద్వారా... ఆ యొక్క ఆ ప్రత్యేక పాత్రలను సృష్టించి, అనేక ఆత్మ సత్యాలను ఎంతో చక్కగా, మనోరంజకంగా బోధించారు. ఎన్ని కష్టాలు పడ్డారు ఆ పాత్రలను సృష్టించడానికి ! ఏం చెప్పటానికి? రెండే విషయాలు ! శరీరక్షేత్రం వేరే ! ఆత్మక్షేత్రం వేరే ! లక్ష్మణుడు వేరే ! సీత వేరే! అంగులీమాళుడు వేరే ! బుద్ధుడు వేరే !

అయితే బుద్ధుడి శరణాగతి పొంది అంగులీమాళుడు కూడా బుద్ధుడయ్యాడు.

అర్జునుడు తదుపరి కాలంలో... మహాభారత యుద్ధం తర్వాత... తానూ ధ్యానం చేసి, తానూ యోగి అయ్యి, తానూ ఒకానొక **పరమాత్ముడు** అయ్యాడు.

మై డియర్ ఫ్రెండ్స్ ! ప్రతి పిల్లవాడూ ఒక పెద్దవాడు అవుతాడు అచిరకాలంలో... హిరణ్యకశ్యపుడు కూడానూ తదుపరి జన్మల్లో తాను ధ్యానం చేసి, తానూ యోగి అయ్యాడు. ఆ జన్మలో శరీరక్షేత్రం, తదుపరి జన్మల్లో తానూ ఆత్మక్షేత్రం అయ్యాడు.

ఆత్మక్షేత్ర విషయం గురించి మాట్లాడుతున్నాం. ఈ 'నేను', ' మేను ' రెండున్నాయి. **మేను** అంటే శరీరక్షేత్రం. **నేను** అంటే ఆత్మక్షేత్రం. ఈ ' మేను ', 'నేను' కాదు ! ' మేను ' – శరీరక్షేత్రం మనం కానే కాదు ! ఆత్మక్షేత్రం మనం. " ఆత్మక్షేత్రమే నేను " అని తెలుసుకున్నాడు కనుకనే శ్రీకృష్ణుడు ఏం చెప్పాడు... " అహమాత్మా గూడాకేశ ! సర్వ భూతా శయస్థితః ! "

సర్వ అంటే సకల భూతకోటి అంటే ప్రాణికోటి ; **ఆశయ** అంటే హృదయాలు గుండెకాయ కాదు. హృదయమంటే ఆత్మ. స్థితి అంటే అన్ని ఆత్మల్లోనూ నేనున్నాను. ఇక్కడ నేనుండే **నేను** అక్కడ నేనుండడంలోనూ ఉంది. సకల నువ్వుల్లోనూ నేనే ! సర్వ భూతాశయ స్థితః !

" అహమాదిశ్చ " – నేను మొట్టమొదటి లోనూ ఉన్నాను.

" మధ్యం చ " – మధ్యం లోనూ ఉన్నాను.

" అన్తః చ " – అంతం లోనూ ఉన్నాను.

" ఈ కాలం యొక్క ఆద్యం, కాలం యొక్క అంత్యం లోనూ నేను అయి ఉన్నాను. నేను అంతటా ఉన్నాను. అర్జునా ! ఇక్కడ ఈ శరీరంలో మాత్రమే ఉండే నేను సర్వత్రా వున్నాను. **మమ ఆత్మా సర్వ భూతాత్మా** ... నా యొక్క ఆత్మ, సర్వ భూతముల యొక్క ఆత్మ ! "

★ ★ ★

అయిదు వ్రేళ్ళున్నాయి. చెయ్యి ఒక్కటే. ఈ చెయ్యి – అయిదు వేళ్ళుగా రూపాంతరం చెందింది. అన్ని వ్రేళ్ళకూ కలిపి ఒకటే చెయ్యి. అలాగే అన్ని జీవుల్లోనూ ఒక్కటే ఆత్మ నిండి ఉంది. అనేక **నేను** లు లేవు. ఉన్నది ఒక్కటే !

**నేను** అంటే గూఢాత్మ. ఆ గూఢాత్మను బ్రహ్మం అన్నారు.

" బ్రహ్మమనంగ వేరె పరదేశమున లేదు
బ్రహ్మమనంగ తానె బట్టబయులు
తన్ను తానెరిగిన తానె పో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినుర వేమ ! "

ఈ బ్రహ్మమనేది విరాట్టు ! అన్నిచోట్లా ఉన్న నేను ! అన్ని సమయాల్లోనూ ఉన్న నేను !

★ ★ ★

అర్జునుడు కృష్ణుడ్ని అడిగాడు – " ఎవరివయ్యా నువ్వు? " శరీరక్షేత్రం ప్రశ్న అడిగింది. " శరీరక్షేత్రం నేను " అనుకున్నవాడు అర్జునుడు. " ఆత్మక్షేత్రం నేను " అని తెలుసుకున్నవాడు కృష్ణుడు. ఆత్మక్షేత్రం "అహమాత్మా గుడాకేశ !" అని సమాధానమిస్తోంది. " అన్నిచోట్లా నేను ఉన్నాను. అన్ని కాలాల్లోనూ నేను ఉన్నాను"...

... ఇంతే ఆత్మక్షేత్రమంటే. ఇంతకన్నా ఏమీ లేదు.

' శరీరక్షేత్రం ' హిరణ్యకశ్యపుడు ... **ఆత్మక్షేత్రం** ప్రహ్లాదుడు!

' శరీరక్షేత్రం ' లక్ష్మణుడు ... **ఆత్మక్షేత్రం** సీత !

' శరీరక్షేత్రం ' అర్జునుడు ... **ఆత్మక్షేత్రం** కృష్ణుడు !

★ ★ ★

ఈ శరీరంలో ఉండి ఈ కళ్ళ లోంచి చూస్తున్నవాడు, ఈ నోటి లోంచి మాటలు మాట్లాడుతున్నవాడు, ఈ చెయ్యిని కదుపుతున్నవాడు ... ఆత్మక్షేత్రం. ఈ చెయ్యి ఎలా లేస్తోంది ? తనంత తానుగా లేస్తుందా ? **నేను** లేపుతున్నానా ?! నేను ఈ చెయ్యిని ఇలా ఇలా లేపుతున్నాను. ఈ చెయ్యి వెనుకాల ఉన్న శక్తిని నేను ! నేను అంటే **ఆత్మ** ! ఇది తెలుసుకోవడం అంటే **ఆత్మక్షేత్రం** తెలుసుకోవడమే ! ఇంతకన్నా ఏమీ లేదు !

★ ★ ★

ఈ **నేను** నిష్క్రమించినప్పుడు ఈ **మేను** శవమైపోయింది. ఇప్పుడు ఈ శరీరం **శవం** కాదు. ఇది **శివం** ... ఇది ఆనందదాయకం. నా నాలుకతో ఇడ్లీలు తింటాను. లడ్లు తింటాను. నాకెంత ఆనందమో ! నా కళ్ళతో సూర్యోదయం చూస్తాను... సూర్యాస్తమయం చూస్తాను. నా చెవులతో, చక్కటి సంగీతం వింటాను. ఇది శివం ! నేను అనేది మేనులో ఉన్నప్పుడు శివం. నేను అనేది మేను నుంచి తొలగినప్పుడు మేను **శవం** !

★ ★ ★

కనుక ఈ మేనును, ఈ శవాన్ని, ఓ **శివం** చేసేది నేను. శరీర క్షేత్రాన్ని ఆనందమయం చేసేది ఆత్మక్షేత్రమే. ఎక్కడ ఆత్మక్షేత్రం అవ్యక్తం అయ్యిందో అక్కడ శరీర క్షేత్రంలో ఉండి పనిచేసేవారు అనుక్షణం దుఃఖం అనుభవిస్తున్నారు. లోపల అగ్ని రగిలి పోతూంటుంది. బయటకి అంతా బాగుందని బూటకాలు చెప్తారు – బయట అంతా బాగుంది. లోపల ఏమీ బాగులేదు ! ఆత్మక్షేత్రంలో ఉండేవాడికి అనుక్షణం ఆనందమే. శరీర క్షేత్రంలో మాత్రమే ఉండేవాడికి అనుక్షణం శంకలే ! భయాలే ! ఆందోళనలే !

కనుక మిత్రులారా ! ప్రతి ఒక్కళ్ళూ కూడానూ ఆత్మక్షేత్రంలోకి ప్రవేశించాలి ! అలా అందరినీ... శరీరక్షేత్రంలో వున్నవాళ్ళనందరినీ... ఆత్మక్షేత్రంలోకి తీసుకురావాలని ప్రతి ఆత్మక్షేత్రం ప్రయత్నిస్తూనే ఉంటుంది. కృష్ణుడు రాయబారానికి ప్రయత్నించాడు. తెలుసు... వాళ్ళు, కౌరవులు, మారరు... వారంతా శరీర క్షేత్రం మనుష్యులు. దారుణమైన శరీరక్షేత్రం మనుష్యులు. వాళ్ళు అయిదు ఊళ్ళు కూడా ఇవ్వమన్నారు.

కానీ ఆత్మక్షేత్ర యోధులు నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు, ఆఖరు సమయం వరకు. తన ప్రాణాలకు తెగించి కృష్ణుడు రాయబారం సాగించాడు. ఎందుకు ప్రాణాలకు తెగించాడు ? తాను శరీరం కాదని తెలుసుకున్నవాడు ఇంక **తెగించే** దేమిటి ! ఓ **ఆటలాడు** కోవడం తప్పితే !

★ ★ ★

కనుక ప్రాణాలను తెగించడమనేది ఒక శరీర క్షేత్రంలో ఉండేవాడికి తగును కానీ, ఆత్మక్షేత్రంలోకి ప్రవేశించిన వాడికి **ప్రాణాలు తెగించట** మనే ప్రసక్తే లేదు ! శరీర క్షేత్రంలో ఉండి ప్రాణాలకు తెగించిన వాడు వీరుడు. ఆత్మక్షేత్రంలో ప్రవేశించిన వాడు **ధీరుడు** కాదు ! **వీరుడు** కాదు ! ఏదీ కాదు వాడు. ఆత్మక్షేత్రంలో ఉన్న ఒకానొక యోగి " ప్రాణాలకు తెగించడ " మన్న ప్రశ్నే లేదు. " తాను శరీరక్షేత్రం కాదు, ఆత్మక్షేత్రం " అని తెలుసుకున్నవాడు కనుక ఆత్మక్షేత్రంలో ప్రవేశించిన వాడికి ప్రాణాలు తెగించి పోరాడటం అన్నది లేనే లేదు. " చంపుతావా ?! చంపుకో ! **ఆట** అన్నది ఉంటుంది. కానీ **పోరాటం**, **తెగించడం** ఏమీ లేవు... ఆత్మక్షేత్రంలో ప్రవేశిస్తున్నవాడికి.

★ ★ ★

మిత్రులారా ! ఈ రోజు రెండు విషయాలు తెలుసుకున్నాము. శరీరక్షేత్రం వేరే! ఆత్మక్షేత్రం వేరే ! నేను వేరే ! మేను వేరే ! ప్రహ్లాదుడు వేరే ! హిరణ్యకశ్యపుడు వేరే! లక్ష్మణుడు వేరే ! సీత వేరే ! అర్జునుడు శరీర క్షేత్రం – కృష్ణుడు ఆత్మక్షేత్రం. ఈ శరీర క్షేత్రాలను తెలుసుకునేది క్షేత్రజ్ఞుడు, ఆత్మక్షేత్రజ్ఞుడు.

క్షేత్రం... కనపడే క్షేత్రం శరీర క్షేత్రం. ఈ క్షేత్రం లోతు తెలుసుకున్నవాడు క్షేత్రజ్ఞుడు... ఆత్మక్షేత్రం. ఇందులో ఇంతకన్నా జటిలమైనది ఏమీ లేదు. ఈ రోజు ఆత్మక్షేత్రమన్న దాని గురించి వివరంగా తెలుసుకున్నాము.

★ ★ ★

ఏసు ప్రభువు తెలుసుకున్నాడు ఆత్మక్షేత్రాన్ని, మహమ్మద్ తెలుసుకున్నాడు. మహమ్మద్ గురించి కొంత తెలుసుకుందాం.

ఆయన ఒక నాస్తికుడితో యుద్ధం చేస్తున్నాడు. మహమ్మద్ ఆత్మక్షేత్రంలో ఉన్నవాడు. ఆ నాస్తికుడు శరీరక్షేత్రంలో ఉన్నవాడు. ఇద్దరూ యుద్ధం చేస్తున్నారు. మహమ్మద్ చేతిలోని కత్తి జారి పోయింది. అప్పుడు వాడేమన్నాడంటే... తన కత్తిని మహమ్మద్ యొక్క మెడమీద పెట్టి... " నీ అల్లా నిన్ను రక్షిస్తాడా ? " అన్నాడు. ఆ సమయంలో అంటే క్రింద మహమ్మద్ ఉన్నాడు. మహమ్మద్ పైన ఆ నాస్తికుడున్నాడు. వాడి చేతిలోని కత్తి మహమ్మద్ కుత్తుక మీద ఉంది. కొంచెం అయితే దిగి పోతుంది అంతే. అప్పుడు పైనున్నవాడు " ఏడీ నీ అల్లా ? " అని అడిగాడు. ఆ సమయంలో మహమ్మద్ వాడి కళ్ళలోకి సూటిగా చూసాడు. " నా అల్లా ఉన్నాడు ! నన్ను రక్షిస్తాడు ! " అన్నాడు. అంత సమయంలో కూడానూ నిర్భయమైన ఆ మహమ్మద్ కళ్ళను చూసి ఆ నాస్తికుడు భయభ్రాంతుడయ్యాడు! చేతిలోని కత్తి జారిపోయింది ! వెంటనే మహమ్మద్ ఆ కత్తిని తీసుకున్నాడు. కత్తి తీసి వాడి మెడ మీద పెట్టి " నాకు అల్లా ఉన్నాడు ! నీకెవరున్నారు? నువ్వు శరీర క్షేత్రం ! ఇప్పుడు నీకు ఎవరున్నారు రక్షించడానికి ? " అన్నాడు మహమ్మద్. వాడు " నువ్వే నన్ను రక్షించు " అన్నాడు. కత్తి తీసేసి " బ్రతికి పోయావు పో ! " అని వాణ్ణి వదలివేసాడు మహమ్మద్, ఆత్మక్షేత్రజ్ఞుడు.

**అహం ఆత్మోస్మి ! అహం బ్రహ్మోస్మి !**

" జ్ఞానక్షేత్రం ! "

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యానుల విశేష వినియోగార్థం *2004*, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన ధ్యానమహోత్సవాల్లో ప్రసాదించిన " జ్ఞానక్షేత్రం " ఆడియో క్యాసెట్ ! తెలియని విషయాలు తెలుసుకుంటూ ... తెలిసిన విషయాలే ఇంకా బాగా తెలుసుకుంటూ ... ప్రయాణం చేస్తూ చేస్తూ వుండడమే జ్ఞానక్షేత్రం ! జ్ఞానక్షేత్రం అవధుల్లేని క్షేత్రం ! ప్రతి ఒక్క విషయం ఎంత తెలిసినా ఇంకా తెలియాల్సింది, తెలుసుకోవాల్సింది ఉంటూనే ఉంటుంది ! ఇలాంటి ఎన్నో విషయాలను పత్రీజీ " జ్ఞానక్షేత్రం " ఆడియో క్యాసెట్ ద్వారా సవివరంగా వివరించారు. పిరమిడ్ మాస్టర్లందరికీ ఎంత జ్ఞాన భాగ్యమో !

– ఎడిటర్

# " జ్ఞానక్షేత్రం ! "

' జ్ఞ ' అంటే ' తెలుసుకోవటం '. ' జ్ఞానక్షేత్రం ' అంటే ' తెలుసుకునే క్షేత్రం '.

మనం వాస్తవానికి ఆత్మపదార్థం !

ఈ ఆత్మపదార్థం శరీరక్షేత్రంలోకి ప్రవేశించింది ! గ్రుడ్డుగా పుట్టింది ; ఆ గ్రుడ్డు పగిలింది … అందులోంచి పిల్లొచ్చింది. ఆ గ్రుడ్డులో ఉన్న పిల్లకు, గ్రుడ్డు పగలగొట్టుకుని బయటికి రావాలని తెలుసు – తెలియదు. ఆ గ్రుడ్డు లోంచి పుట్టిన పిల్లకు మళ్ళీ ఎదగాలనీ తల్లి ఒడిలో చేరాలనీ తెలుసు – తెలియదు ! మరి ఆ పిల్ల పెరిగి ఎన్నో తెలుసుకుంటూ … మరి ఎన్నెన్నో తెలియకుండా ఉంటూ, తానూ ఒక తల్లియై తానూ గ్రుడ్డును ఎలా పెట్టాలో తెలుసుకుని, గర్భం ఎందుకొచ్చిందో తెలియదు కానీ తెలుసు – తెలుసు కానీ తెలియదు ! ఆ గ్రుడ్డులోని పిల్లను ఎలా పొదగాలో తెలుసుకుని … అది కూడా తెలుసు – తెలియదు !

## " తెలుసు - తెలియదు "

కనుక ఈ సృష్టి అంతా " తెలుసు – తెలియదు " అన్న చక్రంలో వుంది ! అన్నీ తన నుంచి తాను తెలుసుకుంటూ ఉండటం, తెలుసుకుంటూ ఉండటం … చివరికి " అంతా తెలుసుకుని " ఉండటం … ! " అంతా తెలుసుకోవటం " అంటే మళ్ళీ " అంతా తెలుసుకోవటం " కాదు. ఉన్నదాన్ని అంతా " సూత్రప్రాయంగా "

తెలుసుకోవటం – మళ్ళీ క్రమక్రమంగా ఉన్నదాన్ని అంతా – " ప్రబంధ ప్రాయంగా " తెలుసుకోవటం.

మళ్ళీ అక్కడ తెలుసుకోవటం – తెలుసుకోకపోవడం – తెలియడం – తెలియకుండా ఉండడం – ఈ " తెలుసు – తెలియదు " అన్న తనం నుంచి తెలుసుకుంటూ ఉండటమే – నిరంతరంగా, తెలుసుకుంటూ ఉండటమే, ఈ క్షేత్రమే ... " జ్ఞానక్షేత్రం " !

★ ★ ★

నాకు సంగీతం రాదు. నేను సంగీతం తెలుసుకోవాలి. సంగీత జ్ఞానం నాకు కావాలి. సంగీతంలో నాకు జ్ఞానం లేదు. నాకు సంగీతం తెలియదు. గొంతు విప్పి పాడలేను. శెమ్మంగుడి శ్రీనివాస అయ్యంగార్ ఎంతో గొప్పగా గొంతు విప్పి పాడారు. ఆయనకు ఎంతో సంగీత జ్ఞానం ఉంది. నాకు సంగీత జ్ఞానం లేదు. నేను నేర్చుకోవాలి. నేర్చుకుంటాను. కొద్ది కొద్దిగా జ్ఞానం వస్తూ ఉంటుంది ... అంటే కొద్ది కొద్దిగా నేను " సంగీత జ్ఞాన క్షేత్రం " లో ప్రవేశిస్తున్నాను. సంగీత జ్ఞానం, ఆ జ్ఞాన క్షేత్రం ... సంగీత జ్ఞాన క్షేత్రం ... " స, ప, స లు పట్టవయ్యా " అంటాడు మొదట గురువు. తరువాత " స రి గ మ ప ద ని స ; స ని ద ప మ గ రి స " ...

ఇదంతా ఎంతోకాలం పడుతుంది. అభ్యాసం చెయ్యాలి. మొదట అపస్వరాలు వస్తాయి ... సహజం ... తరువాత అపస్వర – సుస్వరాలు కలగలపి వస్తాయి ... సహజం. తర్వాత సుస్వరాలు వస్తాయి. తర్వాత సుస్వరాలు చక్కటి నాదంతో నిండి ఉంటాయి. ఇదంతా సంగీత జ్ఞానంలో క్రమ అభివృద్ధి.

కొన్ని రోజులకు " ఎందరో మహానుభావులు ! అందరికీ వందనములు ! " అని త్యాగరాజ కీర్తనలు చక్కగా పాడుతాం ... చూశారా ! అంటే సంగీత జ్ఞానం అభివృద్ధి చెందింది. మొట్టమొదట సంగీత జ్ఞానం ఏమీ లేదు, " ఏమీ లేదా ? " అంటే ... ఉంది. మరి " ప్రక్కవాడు సంగీతం చక్కగా పాడుతున్నాడు " అనే జ్ఞానం నాకు ఉంది కదా ! నాకు సంగీతం రాదు – నాకు తెలియదు – కానీ నాకు తెలుసు అంటే ... " అతను చక్కగా పాడుతున్నాడు, ఇతను సరిగ్గా పాడటం లేదు ; వీడే బాగా పాడుతున్నాడు – వీడికన్నా వాడే బాగా పాడుతున్నాడు " – ఆ జ్ఞానం నాకు

ఉందా లేదా ? ఉన్నది ! మరి మనం పొడగలుగుతున్నామంటే – ' ఒక్క ' పాటే వచ్చు ... అంటే తెలుసూ – తెలియనితనమూ – చూశారా ?

★ ★ ★

వంట చేయాలి. ఫలానా ' సుబ్బమ్మ ' ఇంటికెళ్ళాం. చెత్తగా ఉంది భోజనం. నాలిక చెప్తుంది కదా ... ఫలానా ' వెంకమ్మ ' ఇంటికి వెళ్ళాం. ఎంత బాగుందో ... ! " మరి ఇంటికొచ్చి చెయ్యగలమా ? " అంటే ... " నేను చెయ్యలేనబ్బా ... నాకేం తెలియదు ! " – నాకు తెలియదు. కానీ ఎలా తెలుసుకున్నావ్ ? నీకు వంట చెయ్యటం తెలియదు కానీ ఏ వంట బాగుంటుందో తెలుసు ! నీకు సంగీత జ్ఞానం లేదు కానీ ఏది మంచి సంగీతమో నీకు తెలుసు. సంగీతం గురించి చెవి చెప్తుంది ...! రుచి గురించి నాలిక చెప్తుంది ... !

## " జ్ఞానేంద్రియాలు ... జ్ఞానం "

ఈ నాలిక ... ఈ చెవి ... ఇవి జ్ఞానేంద్రియాలు ! ఈ జ్ఞానక్షేత్రానికి ఈ జ్ఞానాన్ని సమీకరించటానికి ... జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవటానికి ... ఈ జ్ఞానేంద్రియాలు వున్నాయి !

★ ★ ★

ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు ! కర్మేంద్రియాలు అన్నవి జ్ఞానక్షేత్రానికి సంబంధించినవి కావు ... అవి ... కర్మక్షేత్రానికి సంబంధించినవి. జ్ఞానేంద్రియాలు కర్మక్షేత్రానికి సంబంధించినవి కావు ... అవి ... జ్ఞానక్షేత్రానికి సంబంధించినవి.

★ ★ ★

ఈ కంటితో నేను చూస్తున్నాను ... సూర్యోదయం ఎంత బావుందో ... ! మేఘాలు ఎంత బాగున్నాయో ... ! అదేంటి అక్కడ అంతా బురదగా ఉంది ... బాగా లేదు ! అంటే అక్కడ " బావుంది – బాగాలేదు " అనేది చూసే కళ్ళను బట్టి ఉంటుంది. చక్కటి సంగీతం వింటున్నాను. ఇది బావుంది, ఇది బాగాలేదు. చక్కటి రుచి ఉంది. ఇది బాగా లేదు. స్పర్శ సుఖం – ఇది వేడిగా ఉంది. చల్లగా ఉంది. ఇది బాగా లేదు అంటే ఇదంతా జ్ఞానక్షేత్రం ! శరీరవత్ జ్ఞానేంద్రియాల క్షేత్రం !

★ ★ ★

మంచి, చెడుల గురించి తెలుసుకుంటాం ! ఏది మంచి ? ఏది చెడు ? ఎక్కువ తింటాం – ఆయాసం వస్తుంది. తక్కువ తింటాం – ఆకలేస్తూంటుంది. నడవలేము. మధ్యస్థంగా తింటాం – ఆకలి లేదు, ఎక్కువ ఆయాసం లేదు. చక్కగా బాగుంది. ఈ మధ్యస్థంగా ఉంటే చాలా బావుందన్న జ్ఞానం ఎలా తెలుసుకున్నాం? ఇది శరీరానికి సంబంధించినది కాదు అనుభూతికి సంబంధించినది. మనస్సుకు సంబంధించినది.

## " జ్ఞానక్షేత్రం విస్తారం "

ఎన్నో విషయాలు – ఎంతో జ్ఞానం – మనం బుద్ధితో స్వీకరిస్తాం. శరీరంతో కర్మ క్షేత్రంలో ... పంచ జ్ఞానేంద్రియాలతో – బుద్ధితో – జ్ఞాన క్షేత్రంలో ... బుద్ధితో ఏం తెలుసుకుంటాం ! పదిసార్లు ఎక్కువ తింటాము – ఆయాసం వస్తుంది. " ఎక్కువ తింటే ఆయాసం వస్తుందిరోయ్ ! " పదిసార్లు తక్కువ తింటాం – నడిచే దార్లోనే పడిపోతాం. మధ్యస్థంగా సరిగ్గా తిన్నాము – చాలా బాగుంది. " మధ్యేమార్గం " – గౌతమబుద్ధుడు తన బుద్ధితో మధ్యేమార్గం కనుగొన్నాడు. సరిఅయిన జ్ఞానాన్ని తెలుసుకున్నాడు. అది ఆ శరీరంలోని కర్మేంద్రియాల ద్వారా కాకుండా, శరీరంలోని జ్ఞానేంద్రియాల ద్వారా తెలుసుకోబడింది. ఆ బుద్ధితో తెలుసుకున్నాము జ్ఞానాన్ని. ఇదంతా వెరసి " జ్ఞానక్షేత్రం ".

★ ★ ★

ఎంత విస్తారమైన జ్ఞానక్షేత్రం ! ఆత్మక్షేత్రం చాలా సింపుల్ ! అది చాలా చాలా సింపుల్. ఆత్మక్షేత్రం చాలా చాలా సింపుల్. ఆత్మక్షేత్రం గురించి చెప్పటానికి ఎక్కువగా ఏమీ లేదు.

" ఈశావాస్యమిదం సర్వం ... యత్ కించ జగత్యాం జగత్ "

" ఈశావాస్యం ఇదం సర్వం ... " – " ఈ ఉన్నదంతా కూడానూ ఆత్మతో నింపబడి ఉంది " అయిపోయింది. ఒక్కటే ఒక్క వాక్యం చాలు ... ఆత్మక్షేత్రానికి. కానీ జ్ఞానక్షేత్రం అంతులేనిది, అనంతమైనది ! అది తెలుసుకుంటూనే ఉండాలి !

★ ★ ★

ఆస్ట్రల్ బీయింగ్స్ ... అంటే దేవతలు ... ధ్యానం చేసి, " పరమశివుణ్ణి సత్యలోకంలో కలుసుకుందాం ... ఆయన్ను దర్శనం చేసుకుందాం " అనుకున్నారు. దానికి ఈ ఆస్ట్రల్ బీయింగ్స్ ధ్యానం చేసి తమ ఆస్ట్రల్ బాడీ నుంచి కాజల్ బాడీ ... కాజల్ బాడీ నుంచి సుప్రా కాజల్ బాడీ తీసి పరమశివుడి దగ్గరకి వెళ్ళారు. ఆయన ధ్యానం చేస్తున్నాడు, కైలాసంలో. ' కైలాసం ' అంటే అదొక ' పాష్ ఏరియా ' సత్యలోకంలో ! ఎలాగైతే హైదరాబాద్‌లో బంజారాహిల్స్, అమీర్‌పేట్, బేగంపేట్ ఇవన్నీ ఎలాగో ... సత్యలోకంలో ఆ విధంగా ' కైలాసం ', ' వైకుంఠం ' ... నూటతొంభై లక్షల ఏరియాలు ! సహస్రం అంటే వెయ్యి కాదు ... ఆ సత్యలోకంలో అనేక అనేక లోకాలు ఉన్నాయి.

★ ★ ★

సత్యలోకంలో ఒకానొక ఏరియాకు అధిపతియైన ఆ పరమశివుడు ధ్యానం చేస్తూ, కాస్సేపటికి కళ్ళు తెరిచాడు. " ఏమండి ? ఎందుకొచ్చారు మీరంతా ? " అని శివుడు వారిని ప్రశ్నించాడు. వారికి ఏవేవో సమస్యలు ఉన్నాయి. వాటికోసం వాళ్ళు అక్కడికి వెళ్ళారు. అక్కడికి వెళ్ళిన తర్వాత వారు వారి సమస్యలను ప్రక్కన పెట్టి, క్రొత్త ప్రశ్న అడిగారు శంకరుణ్ణి. " స్వామీ ! ఎంతో కష్టపడి ధ్యానం చేసి, మా సూక్ష్మశరీరాల్లోంచి కారణ శరీరాలు, మళ్ళీ మహాకారణ శరీరాలు తీసి, మీ దగ్గరికి వచ్చాము ! ఇది మహాకారణలోకం ! మీరే కదా ఉన్నతోన్నతులు ప్రపంచంలో ! మీరెందుకు ధ్యానం చేస్తున్నారు? " అని అడిగారు. అప్పుడు పరమశివుడు అన్నాడు " అరే భాయ్ ! త్రాటిని తన్నేవాడి తలను తన్నేవాడు ఇంకొకడుంటాడు. నేను ఏళ్ళుగా ధ్యానం చేస్తున్నాను. నేను చేసేది వేరు. నాకు తెలిసింది ఎన్నో ! తెలియవలసింది ఇంకెన్నో ! "

★ ★ ★

శ్రీ వోలేటి వెంకటేశ్వరరావు గారు అని అద్భుతమైన కర్నాటక సంగీతజ్ఞులు ఉండేవారు. సంగీత మహాగురువు గారైన డాక్టర్ శ్రీపాద పినాకపాణి గారి దగ్గర అధికంగా నేర్చుకుని ఆయన్నే ప్రధానంగా తీసుకున్నారు. ఈ వెంకటేశ్వరరావు గారు ముంబాయికి వెళ్ళి సంగీత కచేరీ చేసారు ... షణ్ముఖానంద హాలులో ... అందరూ చాలా బాగుందన్నారు. అక్కడ ఆయన్ను పరిచయం చేసేటప్పుడు " ఈయన గురువు

గారు శ్రీపాద పినాకపాణి " అని చెప్పారు. "అదేమిటండీ మీ గురువు శ్రీపాద పినాకపాణి గారా ?! " అని చాలామంది అన్నారు. " ఈ గొంతు చాలా బావుంటుంది. పినాకపాణి గారి గొంతు మరి ఇంత మధురంగా ఉండదు ". వాళ్ళవి ఏవేవో అపోహలు! అప్పుడు వోలేటి వారు చెప్పారు – " పిచ్చోళ్ళారా ! మీకు నేను గొప్పవాణ్ణి. నాకు ఆయన గొప్పవాడు. ఆయన గొప్పతనం మీకెలా తెలుస్తుంది ? ఆయన గొప్పతనం నాకే తెలుస్తుంది. మీ సంగీత మేధస్సు నా గొప్పతనం వరకే పరిమితం ! "

★ ★ ★

అలాగే ఈ దేవతలంతా పరమశివుడి వరకే పరిమితం. పరమశివుడికి ఇంకా ఎన్నో ... అపరిమితం. మై డియర్ ఫ్రెండ్స్ ! ఈ విధంగా ఈ జ్ఞానం చిలువలు పలువలుగా ... అనంతంగా ... విస్తరిస్తూనే ఉంటుంది.

★ ★ ★

జ్ఞానక్షేత్రానికి మించిన క్షేత్రం లేదు ! ఆత్మక్షేత్రం చాలా సింపుల్. ఒక్కటే పదంలో చెప్పవచ్చు. " We are not body ! We are Atma ! " అని. వెరీ సింపుల్ ! కానీ ఈ జ్ఞానక్షేత్రం ఎంతటి విస్తారమైనదో ! సంగీత జ్ఞానం – పాకశాస్త్ర జ్ఞానం – మృదంగం నేర్చుకోవాలి ! క్రికెట్ నేర్చుకోవాలి !

శ్రీకృష్ణుడు వచ్చాడు హాకీ ఆటకు ! ఆయన చూడటానికీ, నేర్చుకోవటానికీ వచ్చి ఉంటాడు. ఆట గురించి ఆయనకు కొంత తెలుసు. కొంత తెలియదు. " వీళ్ళు ఎలా ఆడతారు ? కొంత నేర్చుకుందాం ! " శ్రీకృష్ణుడికి పని లేక అక్కడికి రాలేదు ఆటకి ... నేర్చుకుందామని వచ్చాడు.

## " భోగం ... జ్ఞానం "

మై డియర్ ఫ్రెండ్స్ ! ప్రతి ఒక్కళ్ళూ కూడానూ ... ప్రతి ఆత్మ కూడానూ ... అనంతంగా, ఈ జ్ఞాన సంపద కోసం అలా ప్రయాణం చేస్తూనే వుంటుంది. ఆత్మ ప్రయాణంలో మొదటి కారణం నేర్చుకోవడం కోసం ... రెండవ కారణం భోగం కోసం ... ఎంజాయ్‌మెంట్. కృష్ణుడు అక్కడికి వచ్చింది హాకీ ఆటను ఎంజాయ్ చేయటానికి. హాకీ ఆటను నేర్చుకోవటం కోసం కూడా వచ్చాడు. రెండూ

సరిసమానమైన క్షేత్రాలు - ఈ ఎంజాయ్ చేయటమనేది భోగక్షేత్రం. ఈ రోజు జ్ఞానక్షేత్రం - నేర్చుకోవటమనే క్షేత్రం !

★ ★ ★

ఆత్మక్షేత్రం ... జ్ఞానక్షేత్రం ... భోగక్షేత్రం - ఆత్మ ఉన్నది నేర్చుకోవటం కోసం - భోగించటం కోసం. ఆత్మ అన్నది ఎంత ఎక్కువ నేర్చుకుంటే అంత ఎక్కువ భోగంలో ఉంటుంది. ఎంత ఎక్కువ భోగంలో ఉంటే అంత ఎక్కువ నేర్చుకోగలిగిన శక్తిని తిరిగి కలిగి ఉంటుంది. భోగం ద్వారా ఒకానొక మనిషికి తృప్తి వస్తుంది. ఆ తృప్తి వున్నప్పుడు ఇంకా ఎక్కువ ఏకాగ్రతతో నేర్చుకుంటాడు. ఇంకొంచెం నేర్చుకున్నప్పుడు జ్ఞానం ఇంకొంచెం ఎక్కువ అవుతుంది. అప్పుడు మనం కొంచెం ఎక్కువగా ఎంజాయ్ చేస్తూంటాం !

## " ప్రతీదీ జ్ఞానమే ! "

ఈ జ్ఞానక్షేత్రంలో అనంతమైన శాఖలున్నాయి. మాట్లాడటం నేర్చుకోవాలి ! ఆలోచించటం నేర్చుకోవాలి ! నిద్రపోవటం నేర్చుకోవాలి ! తినటం నేర్చుకోవాలి ! వంట చేయడం నేర్చుకోవాలి ! వడ్డించటం నేర్చుకోవాలి ! కూర్చోవటం నేర్చుకోవాలి ! నడవటం నేర్చుకోవాలి ! సభా మర్యాదలు తెలిసి ఉండాలి ! సంఘంలో సరియైన పౌరుడిగా ఉండాలి ! స్వతంత్రంగా జీవించగలిగే జ్ఞానం ఉండాలి ! అందరితో కలిసి మెలిసి జీవించే జ్ఞానముండాలి. ప్రత్యేక సందర్భాలలో, ఒక్కొక్కసారి, కోరికలను తగ్గించుకునే జ్ఞానముండాలి !

ఎన్ని రకాల జ్ఞానాలో ! లెక్కలేదు. కంప్యూటర్ జ్ఞానముండాలి ! ఇంటర్నెట్ జ్ఞానముండాలి ! డ్రైవింగ్ జ్ఞానముండాలి ! కొండ ఎక్కాలి ! ఎలా కొండ ఎక్కాలి ? ప్రతీదీ జ్ఞానమే !

★ ★ ★

ఈ మైక్‌లో మాట్లాడుతున్నాను. దగ్గరగా మైక్ పెట్టుకుని మాట్లాడాలా ? దూరంగా పెట్టుకుని మాట్లాడాలా ? ఇదీ జ్ఞానమే ! మొదట్లో మాట్లాడినప్పుడు ఏం మాట్లాడాలో తెలియదు. వణుకుతాం. సభలో మాట్లాడటం చేత కాదు. కానీ " తినగ

తినగ వేము తియ్యగనుండు ! అనగ అనగ రాగమతిశయిల్లు ! సాధనతో సమకూరు పనులు ధరణిలోన ! " మాట్లాడుతూ, మాట్లాడుతూ ఉంటే మైక్ ఎంత దూరంలో పెట్టుకోవాలో తెలుస్తుంది.

★ ★ ★

ఇలాగ ప్రతి విషయమూ జ్ఞానమే ! " ధ్యాన విజయోత్సవాలు " చేయాలి – ఎలా చేయాలి ? డబ్బు ఎలా సమకూర్చుకోవాలి ? అంతమందికి భోజనం ఎలా పెట్టాలి ? ఎవరిని వెళ్ళి ' దేహీ ' అని అడగాలి ? ఎలా ' దేహీ ' అని అడగాలి ? ఎంతలో సర్దుకోవాలి ? ఎంతలో సర్దుకోకూడదు ! సామ, దాన, దండ, భేద ఉపాయాలు ఉపయోగించి, కార్యాన్ని ఎలా సాధించుకోవాలి ? సామం : మంచి మాటలు చెప్పి ... దానం : కొన్ని కన్‌సెషన్స్, డిస్కౌంట్లు ఇస్తూండటం ... నానా బూతులు తిడుతూ, శాపనార్థాలు పెడుతూ ... అది దండం. ఇకపోతే భేదం – అది అన్నిటికన్నా తీవ్రమైనది !

★ ★ ★

సామ, దాన, దండ, భేద ఉపాయాలు ... ఇవన్నీ ఉపాయాలు ... వీటిని ఉపయోగించుకుని ఒకానొక కార్యాన్ని ఎలా సాధించుకుంటాం. అంటే ... ఎంత గొప్ప జ్ఞానం ! ఈ జ్ఞానక్షేత్రం ఎంత విస్తారమైనదో తెలుసుకుంటూనే ఉండాలి ... తెలుసుకుంటూనే ఉండాలి !

## " సవిరామ పరిశ్రమ "

అలాగే ఎప్పుడూ పరిగెత్తుతూ ఉంటే ... నువ్వు క్రింద జారిపడతావు. మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలి ... అవిరామ పరిశ్రమ ఉండకూడదు. సవిరామ పరిశ్రమ ఉండాలి. మరి ఎంతసేపు విరామం తీసుకోవాలి ? ' విరామం ' ... వెరీ వెరీ ఇంపార్టెంట్ ! ' పరిశ్రమ ' ... వెరీ, వెరీ, ఇంపార్టెంట్ ! ఎప్పుడు ' విరామం ' ఉండాలి ? ఎప్పుడు ' పరిశ్రమ ' ఉండాలి ? రెండూ సరి మోతాదుల్లో ఎలా కలిసి మెలిసి ఉండాలి ? చూశారా ! అంటే జ్ఞానక్షేత్రం ఎంత విస్తారమైన క్షేత్రమో !

## " లౌకిక జ్ఞానం "

లౌకిక జ్ఞానం ... " వాడికి ప్రపంచ జ్ఞానం ఉందయ్యా ! వాడికి ఎలా మాట్లాడాలో తెలుసు ... కానీ వాడికి ఆత్మజ్ఞానం లేదు ". ఇంట్లో కొడుకు చచ్చిపోతే ఏడ్చేస్తున్నాడు. ఆత్మజ్ఞానం ఉన్నవాడు ఏడ్వడు. ఏడ్చేవాడు ఆత్మజ్ఞానం లేనివాడు – పండితుడు కానివాడు – అపండితుడు. ఎందుకు అపండితుడు ? వాడు కంప్యూటర్లో పండితుడు – కానీ కొడుకు చచ్చిపోతే ఏడుస్తున్నాడు. వాడు ఆత్మజ్ఞానంలో పండనివాడు, అపండితుడు ! అయితే కంప్యూటర్లో వాడు మేధావి, జ్ఞాని !

★ ★ ★

ఉదాహరణకు – మా అన్నగారు ఉన్నారు. ఆయన ముప్పై ఏళ్ళకే ఇంజనీరింగ్‌లో Ph.D. చేశారు – మరి ఇంగ్లాండ్ నుంచి ! అపారమైన మేధో సంపత్తు ఉంది కానీ ' ఆత్మజ్ఞానం ' మటుకు లేదు. చికెన్లు తింటాడు, మటన్లు తింటాడు, ఒళ్ళంతా సోరియాసిస్‌తో ఉంటాడు. డాక్టర్ల దగ్గరికి పరిగెత్తుతూ ఉంటాడు. మందులు తీసుకుంటూంటాడు – ధ్యానం చెయ్యమంటే చెయ్యడు. ఎందుకంటే ప్రాపంచిక జ్ఞానం ఉంది – కానీ ఆత్మజ్ఞానం మృగ్యం. ప్రాపంచిక జ్ఞానంలో పండితుడు ... కానీ ఆత్మజ్ఞానంలో అపండితుడు.

## " సకల విద్యా పారంగతులు "

కొంతమంది ఆత్మజ్ఞానంలో పండితులుంటారు. అయితే లౌకికంగా మాట్లాడటం చేతకాదు. లౌక్యంగా పనులు చేయించటం చేతకాదు. స్వంత కొడుకు చచ్చిపోతే నవ్వుతూ ఉంటాడు. ఏడ్వడు. ఆ ఆత్మజ్ఞానం ఉంది. కానీ వెళ్ళి ఒక పని చేసుకురావాలంటే " నా వల్ల కాదు " అంటాడు. అంటే లౌకిక జ్ఞానం లేదు.

★ ★ ★

అన్ని రకాల జ్ఞానాలూ ఉండాలి, అన్నీ కావాలి మనిషికి. సకల విద్యాపారంగతులం కావాలి. సకల కళాకోవిదులం కావాలి. ఆ దిశగా ప్రయత్నం చెయ్యాలి. ఎప్పుడూ ... నిరంతరం ... జ్ఞానక్షేత్రాన్ని ... 360 డిగ్రీస్‌లోనూ ... అలా విస్తారం చేస్తూ ఉండాలి. ప్రతీదీ నేర్చుకుంటూ ఉండాలి.

## " మానవుడు = ఆత్మ + మనస్సు "

ఒక స్వామి చెప్పారు … " ఒక చీమ దగ్గరి నుండి నేను తెలుసుకున్నాను " అని చెప్పేసి – ఆ చీమ తన బరువు కన్నా పదిరెట్లు లాగుతోంది. మరి, ఈ మానవులు … 70 కేజీల వాళ్ళు … 50 కేజీలు ఎందుకు లాగలేరు ? లాగగలరు ! ఆ ఏకాగ్రత ఉంటే … ప్రతి చీమ, ప్రతి ఏనుగు, ప్రతి చేప … ఏదైనా గానీ ప్రకృతిలో ధ్యానంలోనే ఉంది. దానికి ' మనస్సు ' లేదు. ఆత్మ ఒక్కటే ఉంది. మానవుడు అంటే మనస్సు కలిగినవాడు. మానవుడు = ఆత్మ + మనస్సు. ఈ మనస్సు క్షీణింపచేస్తూ ఉంటుంది ఆత్మ యొక్క శక్తిని. ఈ మనస్సు నిర్మానుష్యమైనప్పుడు, నిర్మలమైనప్పుడు మళ్ళీ ఆత్మశక్తి తేజోవంతమవుతుంది. ఆ చీమ లాగా తాను కూడా పదిరెట్ల బరువును లాగగలుగుతాడు !

## " నేను నేర్చుకుంటూనే వుంటాను "

నా చేత అందరూ తిట్లు తింటూ ఉంటారు. ఒక్క ' కామా ' సరిగ్గా ఉండదు కరెక్షన్స్‌లో ' ఫుల్‌స్టాప్ ' ఉండదు. తిట్లు తింటూ ఉంటారు. ' కామా ' సరిగ్గా ఉండాలి. ' ఫుల్‌స్టాప్ ' సరిగ్గా ఉండాలి. " నాకు అన్నీ తెలుసా ? " అంటే నాకూ అన్నీ తెలియవు ! అయితే కొన్ని విషయాలలో నాకు తెలిసినంత మీకు తెలియదు !

నేను సంగీతం నేర్చుకున్నాను. " నాకన్నా బాగా పాడేవాడు లేరా ? " అంటే లక్షలమంది ఉన్నారు ! కనుక నేనూ నేర్చుకోవాలి … సంగీతంలో నేను ఇంకా మాధుర్యంగా పాడాలి ! ఇంకా టెక్నికల్‌గా పాడాలి ! కనుక నేను నేర్చుకునేది ఎంతైనా ఉంది.

★ ★ ★

నేను నేర్చుకుంటూనే ఉంటాను. నేను ప్రతి మనిషి దగ్గర నేర్చుకుంటూనే ఉంటాను. ప్రతి విషయం నేర్చుకుంటూనే ఉంటాను. నాకు తెలిసిన ప్రతి విషయం నేర్పిస్తూనే ఉంటాను. ప్రతి ఒక్కరికీ, ప్రతి నిమిషం, ప్రతి క్షణం నేర్పిస్తూనే ఉంటాను. ప్రతి ఒక్కళ్ళ నుంచి ప్రతి నిమిషం, ప్రతి క్షణం నేర్చుకుంటూనే ఉంటాను. అందరి యొక్క జ్ఞానక్షేత్రాన్ని విస్తరింపచేయటమే నా యొక్క జీవిత లక్ష్యం. నా స్వంత జ్ఞానాన్ని విస్తరింపచేసుకోవటమే నా జీవిత లక్ష్యం.

★ ★ ★

నేను ఏం నేర్చుకోవాలి ? నేను నేర్పించేది ఏమిటో నేను నేర్చుకోవాలి ! ' ఈవిడ ' కెలా ధ్యానం చెప్పాలి ? ' ఆ ' చిన్నపిల్లవాడికి ధ్యానం ఎలా చెప్పాలి ? ' రామన్న ' అడిగితే ఎలా చెప్పాలి ధ్యానం గురించి ? ' రీసెర్చ్ స్కాలర్ ' కు ఎలా చెప్పాలి ? ' గొప్ప అవధాని ' గారు ఉన్నారు ... వారికి ఎలా చెప్పాలి ? ... అంటే అందరికీ ఎలా చెప్పాలో నేను రకరకాల ప్రయోగాలు చేసి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. నా దగ్గర నుంచి నేను నేర్చుకున్నాను. ప్రక్కవాడి నుంచి నేర్చుకున్నాను.

## " ధ్యానం = జ్ఞానం "

ఈ నేర్చుకోవటమన్నది ... ఇదే జ్ఞానక్షేత్రం ! నేర్పించటం ఎలాగో నేర్చుకోవాలి ! నేర్చుకోవటం ఎలాగో నేర్చుకోవాలి ! ' ఏకసంధాగ్రహి ' ... మనస్సు శూన్యంగా ఉంటేనే వాడు ఏకసంధాగ్రాహి అవుతాడు. మనస్సు శూన్యం చేసుకుని ప్రతీదీ గ్రహిస్తాడు. కనుక ఈ జ్ఞానక్షేత్రానికి మూలమైనది ధ్యానక్షేత్రం. ధ్యానం వల్లనే జ్ఞానం. ధ్యానం లేకుంటే అంతా అజ్ఞానమే! ధ్యానం అయిదు కేజీలుంటే జ్ఞానం అయిదు కేజీలు ! ధ్యానం 500 కేజీలుంటే జ్ఞానం 500 కేజీలు ! ధ్యానం అయిదు లక్షల కేజీలుంటే జ్ఞానం అయిదు లక్షల కేజీలు !

## " జ్ఞానం = ముక్తి "

' ముక్తి ' అనేది ఒక ఫుల్‌స్టాప్ కాదు. అది అనంతమైన ... ప్రవాహం ... అలా ధారాపాతంగా పోతూంటుంది. ధ్యానం కూడా అంతే. జ్ఞానం కూడా అంతే. ఎంత ధ్యానం చేస్తే, అంత జ్ఞానం వస్తూ ఉంటుంది. ఎంత జ్ఞానం వస్తూంటే అంత ముక్తి వస్తూంటుంది. ధ్యానం ... జ్ఞానం ... ముక్తి ... ఇవి అనంతమైన క్షేత్రాలు !

★ ★ ★

మై డియర్ ఫ్రెండ్స్ ... ! ఈ జ్ఞానక్షేత్రం అన్నది నేర్చుకునే క్షేత్రం. మరి జ్ఞానాన్ని విస్తరింపచేసుకునే క్షేత్రం. దీనికి మౌలికమైన క్షేత్రం ధ్యానం. కనుకనే మనం అందరినీ ధ్యానులుగా చేయమని కోరుకుంటున్నాం. ధ్యానం చేస్తే, జ్ఞానాన్ని విస్తరింపచేసుకుంటూనే ఉంటాం. ఎందుకంటే ధ్యానులయ్యాం కనుక ! ధ్యాని కాని వాడు జ్ఞాని కావటం చాలా కష్టం. ధ్యాని అయినవాడు జ్ఞాని కావటం ... ఏ ఫీల్డులో

అయినా కూడానూ ... చాలా సులభం. మన పిల్లలకు ధ్యానం నేర్పిద్దాం ... అప్పుడు వారు తమ స్వంత జ్ఞానాన్ని తాము హాయిగా సమీకరించుకుంటారు. వారికి జ్ఞానాన్ని నేర్పించరాదు ... ధ్యానాన్ని నేర్పించాలి !

★ ★ ★

ధ్యానం నేర్పించకుండా జ్ఞానం నేర్పించాలని పోతారు ! ధ్యానం లేని శిష్యుడు శిష్యుడే కాదు. ధ్యానం లేని స్టూడెంట్ స్టూడెంటే కాదు. వీడికే జ్ఞానం లేదు. ధ్యానం లేని బోధకుడు బోధకుడే కాదు.

## " ధ్యానక్షేత్రం "

మై డియర్ ఫ్రెండ్స్ ! ధ్యానం అన్నది జ్ఞానానికి ప్రాథమికమైనది ... " ధ్యానక్షేత్రం " అన్నది అత్యంత మౌలికమైన క్షేత్రం. " ధ్యానక్షేత్రం " అన్నది చాలా చాలా సింపుల్. " కేవలం శ్వాసతో వుండండి ... మనస్సు శూన్యమయిపోతుంది ... " అంతే ! ధ్యానక్షేత్రం చాలా సింపుల్. జ్ఞానక్షేత్రం అనంతమైనది.

ధ్యానక్షేత్రం – " కళ్ళు రెండూ మూసుకో ! చేతుల్లో చేతులు పెట్టు – శ్వాస మీద ధ్యాస పెట్టు – మనస్సు నిర్మలమైపోతుంది. " అంతే !

ఆత్మక్షేత్రం చాలా సింపుల్. ధ్యానక్షేత్రం చాలా సింపుల్. రెండే రెండు ముక్కలు – శ్వాసానుసంధానం ద్వారా – ఫస్ట్ స్థిరసుఖాసనం తీసుకో ! తర్వాత శ్వాసానుసంధానం చెయ్యి ! చేస్తూ ఉండు – మనస్సు నిర్మలంగా ఉంటుంది. చిత్తవృత్తులు నిరోధమవుతాయి. ఆ తర్వాత మొత్తం అంతా తెలుస్తుంది.

కనుక మై డియర్ ఫ్రెండ్స్ ! తెలుసుకుందాం జ్ఞానక్షేత్రం అన్నది ఓ విస్తారమైన, సువిస్తారమైన క్షేత్రం అని ! ప్రతీదీ తెలుసుకుంటూ ఉండాలి. అనుక్షణం తెలుసుకుంటూ ఉండాలి. ప్రతి ఒక్కరి దగ్గర నుంచి తెలుసుకుంటూ ఉండాలి. ప్రతి ఒక్కరికీ నేర్పిస్తూ ఉండాలి.

జ్ఞాన క్షేత్రానికి గట్టిగా చప్పట్లు కొడదాం ! ఈ జ్ఞాన క్షేత్రానికి మూల క్షేత్రమైన ధ్యాన క్షేత్రానికి ఇంకా గట్టిగా చప్పట్లు కొడదాం !

*[ బ్రహ్మర్షి పత్రీజీ గారి " జ్ఞానక్షేత్రం " ఆడియో కేసెట్ నుంచి... ]*

# “ త్రయీ మార్గ బుద్ధ యోగం ”

బ్రహ్మర్షి పత్రీజీ గానం ... పిరమిడ్ ధ్యానుల అంతరంగాలలో ... గంగాప్రవాహంలా ప్రవహిస్తూంటుంది. ఆ గానం ద్వారా జ్ఞాన బాంఢాగారం సమస్తం ప్రతి పిరమిడ్ ధ్యాని నాడులలో ప్రతిధ్వనిస్తూంటుంది. బుద్ధ బోధన ... వారి సుమధుర సుస్వర ఆలాపనలతో కూడుకున్నదే " ధ్యాన గంగ " ...

– ఎడిటర్

# " త్రయీ మార్గ బుద్ధ యోగం "

మిత్రులారా ! ధ్యానం గురించి తెలుసుకుందాం ! ఏమని చెప్తాం ధ్యానం యొక్క భాగ్యం ! ఎంతని పొగుడుతాం ధ్యాన జీవితం యొక్క మహత్యం గురించి !

మానవుడికి కావలసింది సంపూర్ణమైన ధ్యాన జీవితం. మానవుడికి కావలసింది బుద్ధితో కూడుకుని వుండటం... దాని పేరు **బుద్ధి యోగం** బుద్ధి ఉన్నవాడే బుద్ధుడు ! బుద్ధి కలిగి వుండడమే బుద్ధ యోగం ! అనుక్షణం మనం బుద్ధితో కలిసి వుండవలె ! మన చూపు, మన మాట, మన ఆలోచన... అన్నీ కూడానూ... బుద్ధితో కూడి వుండవలె. మరి మన జీవితమంతా కూడానూ ధ్యానానికి అంకితం కావలె, ధ్యానానికి అంకితం కావలె !

**" ఎంత భాగ్యమో ! ఎంత భాగ్యమో !**
**ఎంత సౌఖ్యమో ! బుద్ధ యోగం ! ధ్యాన జీవితం ! "**

గౌతమ బుద్ధుడు మనకు ఎంత చక్కటి బుద్ధి యోగాన్ని ప్రసాదించాడో. వారి అడుగు జాడల్లో మనం పయనిద్దాం. గౌతమ బుద్ధుడు మనకు ఆనాపానసతి అనే ఒక దివ్య వరాన్ని ప్రసాదించాడు. ఆనాపానసతి అన్నది ఎంతటి వరమో ! ఎంతటి భాగ్యమో! ఆనాపానసతి ద్వారా ఎంతటి శరీర సుఖమో ! ఎంతటి శరీరారోగ్యమో ! ఎంతటి మానసిక ప్రశాంతతో ! చెప్పనలవి కాదు – మిత్రులారా ! ధ్యాన జీవితాన్ని జీవించుదాం. బుద్ధి యోగాన్ని కలిగించుకుందాం.

" ఎంత భాగ్యమో ! ఎంత భాగ్యమో !
ఎంత సౌఖ్యమో ! బుద్ధ యోగం ! ధ్యాన జీవితం ! "

" ఆనాపానసతి ! ఆనాపానసతి !
హంసయానం ! కర్మ క్షాళనం ! దివ్య నేత్రం ! "

ఆనాపానసతి అంటే హంస యానం మిత్రులారా ! దాని ద్వారా కర్మలన్నీ ప్రక్షాళనం చెంది అప్పుడు దివ్యనేత్రం వికసిస్తుంది. బుద్ధుడు మనకు ప్రసాదించింది ఆనాపానసతి – శ్వాసానుసంధానం – హంసయానం.

హంస అంటే శ్వాస – శ్వాస అంటే హంస. శ్వాస మీద ధ్యాసే హంసయానం. మనం పరమహంసలం కావలె. ప్రతి వ్యక్తి కూడానూ ఒక యోగి కావలె ! ఒక ఋషి కావలె ! ఒక పరమహంస కావలె ! సత్యాసత్యాలనెరిగి, అసత్యాలకు దూరంగా, సత్యానికి దగ్గరగా చేరవలె. ఉన్నది ఒక్కగానొక్క వస్తువు. శ్వాస. దాని మీద ధ్యాస పెట్టవలె, దాని పేరే ఆనాపానసతి.

దివ్యనేత్రం – ముక్కంటి కావలె మనమందరం ! దివ్య నేత్రంతో, మన జ్ఞాన నేత్రంతో మన గత జన్మలన్నీ తెలుసుకుంటాం. " మనం శరీర పదార్థం కాదు ఆత్మ పదార్థం " అని తెలుసుకుంటాం! " అహం బ్రహ్మాస్మి " అని తెలుసుకుంటాం ! ఇదే బుద్ధ యోగం!

★ ★ ★

బుద్ధ యోగం మనకు మూడు వరాలు ప్రసాదించింది – మొట్టమొదటిది – ఆనాపానసతి అయితే – రెండవది మధ్యే మార్గం. మనిషి ఎప్పుడూ కూడానూ ఎక్కువ తక్కువలలో జీవించరాదు. మధ్యస్థంలో జీవించవలె ! ఎక్కువ తినరాదు, తక్కువ తినరాదు! ఎక్కువ డబ్బులు సంపాదించరాదు – తక్కువ డబ్బులు సంపాదించరాదు ! ఇహం, పరం... రెండూ కలగొలుపుగా ఉండవలె! దీని పేరే మధ్యే మార్గం !

సంసారంలోనే నిర్వాణాన్ని జోడించవలె ! నిర్వాణంలో సంసారాన్ని జోడించవలె! మధ్యే మార్గం మిత్రులారా !

" మధ్యే మార్గం – ప్రజ్ఞా కారకం !
నిర్వాణాత్మకం – శూన్యభావం ! "

బుద్ధ ప్రబోధిత - మధ్యేమార్గం - సకల ఆచార్యుల ప్రబోధిత మధ్యేమార్గం ! గ్లోరియస్ మిడిల్ పాత్ - అత్యద్భుతమైన మధ్యే మార్గం.

మధ్యేమార్గమే ప్రజ్ఞా కారకం ! మానవుడికి ప్రజ్ఞ కావలె ! మానవుడు ప్రజ్ఞావంతుడు కావలె ! బుద్ధ యోగి కావలె !

★ ★ ★

గౌతమ బుద్ధుడు మనకెన్నో వరాలను ప్రసాదించారు. 2500 సంవత్సరాల క్రితమే ఆయన ఎంత బోధించాడో ! సర్వమూ బోధించాడు. మూడు అఖండమైన సందేశాలను ఆయన మనకిచ్చాడు - మూడు ఆదేశాలను మనకిచ్చాడు.

ఒకటేమో - ఆనాపానసతి - శ్వాస మీద ధ్యాస ! రెండవది - మధ్యేమార్గము! మూడవది - అహింసాతత్వము !

ఒక ప్రాణిని... ముఖ్యంగా మానవుడు ఏ జంతుజాలాన్నీ చంపటానికి వీల్లేదు !

" అహింసో పరమో ధర్మః "

" ఆనాపానసతి " అన్నప్పుడు " హంసా పరమో మోక్షః " అన్నాడు. "మధ్యేమార్గం" అన్నప్పుడు జీవితంలో ఎలా జీవించాలో, ఇహము, పరము చక్కగా కలగలిపి ఎలా ఉండాలో చెప్పాడు మిత్రులారా! ఇకపోతే " అహింసాతత్వం " అన్నప్పుడు ఒక ప్రాణి మరొక ప్రాణితో ఎలా ఉండాలో... ముఖ్యంగా మానవుడు జంతుజాలంతో, జంతు సామ్రాజ్యంతో ఎలా ఉండాలో.,. చెప్పాడు. అహింసతో జీవించవలె ! రక్త పాతం చేయరాదు. రక్తపు కూడు తినరాదు. బుద్ధ అవతారమంటే అహింసావతారమే కదా !

**" అహింసాతత్వం మైత్రిదాయకం !**
**కరుణా ధర్మం... కాంతి క్షేత్రం ! "**

ఎవరైతే హింసాతత్వంలో ఉంటారో వాళ్ళకు అందరు శత్రువులే. ఎవరైతే అహింసా తత్వంలో ఉంటారో సర్వ ప్రాణికోటి వాళ్ళకు మిత్రులే !

మనకన్నా తక్కువగా ఉన్న వారి పట్ల కరుణ చూపించవలె. అదే కరుణా ధర్మం.

ఏసు ప్రభువు ఎంతటి కరుణామయుడో ! మరి మనం కూడా అంతటి కరుణామయులం కావలె ! అహింసాతత్వమే మైత్రిదాయకం - కరుణాధర్మమే కాంతి క్షేత్రం.

ధ్యాన మిత్రులారా ! గౌతమ బుద్ధుడు 2500 సంవత్సరాల పూర్వమే చక్కటి ధ్యాన జీవితాన్ని ప్రసాదించాడు ! చక్కటి బుద్ధ యోగాన్ని ప్రసాదించాడు. మనందరం కూడానూ ఆ యొక్క 2500 సంవత్సరాల క్రిందటి ఆ యొక్క దివ్య సందేశాన్ని మళ్ళీ స్వీకరిద్దాం. మిత్రులారా ! ఆనాపానసతి ని చేపడ్దాం. మధ్యేమార్గంలో నడుద్దాం. మరి అహింసాతత్వంలో జీవిద్దాం.

# “ పాపాత్ములు...! పుణ్యాత్ములు...! ధ్యానాత్ములు...! ”

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యానుల విశేష వినియోగార్థం అక్టోబర్ నెలలో ప్రసాదించిన ధ్యాన మాధుర్యం "ధ్యాన మాధురి " ఆడియో క్యాసెట్ ! చక్కటి సంగీత, ధ్యాన సాహిత్యాలతో పిరమిడ్ ధ్యానులను ధ్యాన మాధుర్య మధుర స్మృతులలో ఓలలాడేలా పత్రీజీ గానం మధురం... స్వరం మధురం... గాత్రం మధురం... మధురం... మధురం... ధ్యాన మాధురి మధురం... పత్రీజీ మధురం...

– ఎడిటర్

# " పాపాత్ములు...! పుణ్యాత్ములు...! ధ్యానాత్ములు...! "

మిత్రులారా !

మానవుల అనేక రకాల కార్యకలాపాల గురించి తెలుసుకుందాం ! మరి ఆ కార్యకలాపాల ప్రతిఫలాల గురించి తెలుసుకుందాం ! మానవుల కార్యకలాపాలన్నీ కూడానూ మూడు రకాలుగా విభజించవచ్చు.

ఒకటేమో ఇతర ప్రాణికోటికి హాని కల్గించే కార్యక్రమాలు.

రెండవదేమో ఇతర ప్రాణికోటికి శుభం కల్గించే కార్యక్రమాలు.

మూడవ రకం ఎవరికి వారు హాయిగా ధ్యానంలో ఉండే కార్యక్రమాలు.

మూడు రకాల మనుష్యులున్నారు.

**మొట్టమొదటి రకం** : పాపాలు చేసేవారు - ఇతర ప్రాణికోటికి హాని కలిగించేవారు, కీడు కలిగించేవారు... వృక్ష జాతికి గానీ, జంతు సామ్రాజ్యానికి గానీ, మానవ సామ్రాజ్యానికి గానీ ! పాపాలు ఎప్పుడూ చేయరాదు. పాపాల ఫలాలు దుఃఖదాయకాలు. మనం చేసే పాపాల వల్లనే మనకు రోగాలు వస్తున్నాయి ! మిత్రులారా, ఎవ్వరూ పాపం చేయకుండా ఉందుదురు గాక ! చిన్న చిన్న పాపాలు చేస్తే, చిన్న చిన్న రోగాలు వస్తున్నాయి. పెద్ద పెద్ద పాపాలు చేస్తే, పెద్ద పెద్ద రోగాలు వస్తున్నాయి. రకరకాల పాపాలు చేస్తే వారికి రకరకాల రోగాలు వస్తున్నాయి. డాక్టర్లకు తెలియదు... రోగాలు ఎందుకు వస్తున్నాయో! పాప కర్మల వల్లనే రోగాలు వస్తున్నాయి.

" పూర్వ జన్మ కృతం పాపం వ్యాధిరూపేణ పీడ్యతే "

**రెండవరకం :** పుణ్యాలు ! అందరికీ, సకల ప్రాణికోటికీ మేలు చేసేవారు. పుణ్యాల ఫలాలు భోగాలు ! చిన్న చిన్న పుణ్యాలు చేస్తే చిన్న చిన్న భోగాలు కలుగుతాయి. పెద్ద పెద్ద పుణ్యాలు చేస్తే పెద్ద పెద్ద భోగాలు కలుగుతాయి.

**మూడవ రకం :** చక్కటి కార్యక్రమం ధ్యాన కార్యక్రమం! అంటే చక్కగా తమలో తాము జీవించే కార్యక్రమం! ఉన్న మనస్సును శూన్యం, పరిశూన్యం చేసుకుని జీవించే కార్యక్రమం... ఎవరైతే ధ్యానం చేస్తారో, వాళ్ళకు ఆత్మజ్ఞానం అంకురిస్తుంది ! " తస్మాత్ యోగీభవ ! " అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. అందరూ కూడానూ ధ్యానాత్ములు కావలె. పాపాత్ములు ఒక వైపు, పుణ్యాత్ములు రెండవ వైపు... మూడవ వైపు ధ్యానాత్ములు.

★ ★ ★

ధ్యానం వల్లనే జ్ఞానం వస్తుంది. చక్కగా పాడుకుందాం పాటల ద్వారా మన మనస్సును రంజింప చేసుకోవడమే కాకుండా ఆత్మ జ్ఞానాన్ని కల్గించుకుందాం.

" పాపములే రోగములు !
చిన్న చిన్న పాపములే చిన్ని చిన్ని రోగములు !
పెద్ద పెద్ద పాపములే పెద్ద పెద్ద రోగములు !
రకరకాల పాపములే రకరకాల రోగములని
తెలియుము ! తెలియుము ! తెలియుము !

పుణ్యములే భోగములు !
చిన్ని చిన్న పుణ్యములే చిన్న చిన్న భోగములు !
పెద్ద పెద్ద పుణ్యములే పెద్ద పెద్ద భోగములు !
రకరకాల పుణ్యములే రకరకాల భోగములని
తెలియుము ! తెలియుము ! తెలియుము ! "

పాపాల వలన రోగాలు వచ్చినప్పుడు, పుణ్యాల వలన భోగాలు వస్తాయి. ఈ జన్మలో అనుభవిస్తున్న భోగాలన్నీ పూర్వ జన్మలో చేసుకున్న పుణ్య కార్యక్రమాల ఫలితాలే.

గత జన్మల్లో చేసుకున్న పాపాలు ఈ జన్మలో మనకు రోగాలుగా వచ్చినప్పుడు, గత జన్మల్లో చేసుకున్న పుణ్యాలు మనకు ఈ జన్మలో భోగాలుగా వస్తున్నాయి.

భోగాలు ఊరకే రావు ! మేఘాలు లేకుండా వర్షాలు వస్తాయా ? పాపాలు లేకుండా రోగాలు వస్తాయా ? మరి పుణ్యాలు లేకుండా భోగాలు కలుగుతాయా ? ఎంత పుణ్యం చేస్తామో అంత భోగం మనం అనుభవిస్తాం. ఎంత పాపం చేస్తామో అంత రోగం అనుభవిస్తాం! కనుక మిత్రులారా! పాపాల వల్లనే రోగాలు - పుణ్యాల వల్లనే భోగాలు - పుణ్యాలే చేద్దాం మిత్రులారా !

రకరకాల పాపాలు చేస్తే రకరకాల రోగాలు వస్తున్నాయి. రకరకాల పుణ్యాలు చేస్తే రకరకాల భోగాలు కల్గించుకుంటున్నాం. ఎన్ని రకాల పుణ్యాలున్నాయో... అన్ని రకాల పుణ్యాలూ చేద్దాం మిత్రులారా ! మరి అన్ని రకాల భోగాలనూ భోగిద్దాం. పుణ్యాలే చేయవలె ! పాపాలే వదిలి పెట్టవలె !

★ ★ ★

యోగీశ్వరులందరూ... సృష్టి ఆది నుంచి ఇప్పటి వరకు... చెప్పేది ఒకటే... " చెడు చెయ్యవద్దు ! మంచి చేయండి ! ఎవరిని వారే తెలుసుకోండి ! "

కర్మ సిద్ధాంతం మనకు చెప్తుంది... " నువ్వు ఎలాంటి కార్యక్రమాలు చేస్తావో అలాంటి ప్రతిఫలాలనే పొందుతావు. చెడు కార్యక్రమాల ద్వారా మరి చెడు ఫలితాలు వస్తాయి. మంచి కార్యక్రమాల ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. మరి ధ్యాన, స్వాధ్యాయ, సజ్జన సాంగత్య కార్యక్రమాలకు చక్కటి ఆత్మజ్ఞానం అంకురిస్తుంది".

కనుక మొత్తం ఆధ్యాత్మిక విజ్ఞాన సాగరం అంతా కూడానూ ఈ మూడు వాక్యాలలో తెలుస్తుంది.

1. పాపములే రోగములు
2. పుణ్యములే భోగములు
3. ధ్యానములే జ్ఞానములు

అన్నింటికన్నా ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవల్సింది ఏమిటంటే రకరకాల పాపాలు ఉన్నాయి, రకరకాల పుణ్యాలున్నాయి, కానీ రకరకాల ధ్యానాలు లేవు. రామ ధ్యానమనీ, శ్రీకృష్ణ ధ్యానమనీ, గాయత్రీ ధ్యానమనీ, ఏసు ధ్యానమనీ, అల్లా ధ్యానమనీ... ఎక్కడా ప్రపంచంలో లేవు ! ఉన్నది ఒక్కటే ఒక ధ్యాన విధానం... దాని

పేరు శ్వాసానుసంధానం. మన ఉచ్ఛ్వాస నిశ్వాసలతో మనం కూడుకుని ఉండవలె. శ్వాసానుసంధానం ద్వారా చిత్తవృత్తి నిరోధం జరుగుతుంది. తద్వారా మరి విశ్వమయ ప్రాణశక్తి ఆవాహనం జరుగుతుంది. తద్వారా మరి నాడీ మండల శుద్ధి జరిగి, మన దివ్యచక్షువు ఉత్తేజింపబడుతుంది. ఆ ధ్యానచక్షువే జ్ఞానచక్షువు... " నేను శరీరం కాదు ఆత్మ " అని తెలియజేసే చక్షువు !

" అహం దేహోస్మి " అన్న అజ్ఞానాన్ని వీడి " అహం బ్రహ్మోస్మి" ***" అంతా నేనే ! నేనే అంతా "*** అని తెలుసుకుంటాం. అందరూ కూడానూ హాయిగా కూర్చుని కళ్ళు రెండు మూసుకుని ఉచ్ఛ్వాస నిశ్వాసలతో కూడుకుని వుందాం ! గౌతమ బుద్ధుడు చెప్పిన ఆనాపానసతిలో విరాజిల్లవలె ! మై డియర్ ఫ్రెండ్స్ ! ఎవ్వరూ కూడానూ మాంసం తినకుండా ఉందురు గాక ! ఇతోధికంగా ధ్యానంలో ఉందురు గాక !

" ధ్యానములే జ్ఞానములు "

ధ్యానం వినా జ్ఞానం లేదు ! జ్ఞానం వినా ముక్తి లేదు !

చిన్న చిన్న ధ్యానాలు చేస్తే, చిన్న చిన్న జ్ఞానాలు వస్తాయి.

పెద్ద పెద్ద ధ్యానాలు చేస్తే పెద్ద పెద్ద జ్ఞానాలు వస్తాయి.

రోజుకు 5 నుండి 15 నిమిషాలు ధ్యానం చేస్తే చిన్న ధ్యానం.

రోజుకు 2 నుండి 3 గంటలు ధ్యానం చేస్తే పెద్ద ధ్యానం.

ముమ్మిడివరం బాల యోగి ఎంత పెద్ద ధ్యానం చేసారో ! మరి మనమెందుకు ధ్యానం చేయడం లేదు ? ఆ విధంగా.

రకరకాల ధ్యానాలు లేవు ! రకరకాల జ్ఞానాలు లేవు! ఉన్నది ఒక్కగానొక్క ధ్యానం – దాని పేరు శ్వాసానుసంధానం. ఉన్నది ఒక్కటే ఒక్క ఆత్మజ్ఞానం... దాని పేరు " అహం బ్రహ్మోస్మి " ! " అహం దేహోస్మి " కాదు.

భగవద్గీతలో కృష్ణుడు

**" యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి –**

**శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యః సఃమే ప్రియః "** అన్నారు కదా !

" శుభ అశుభ పరిత్యాగీ " అన్నారు. పాపాలూ, పుణ్యాలూ రెండూ ప్రక్కన బెట్టి ధ్యానం చేయమన్నాడు ! ఆత్మజ్ఞానం సంపాదించుకోమన్నాడు ! మనమందరం కూడానూ ధ్యానాత్ములం కావలె !

★ ★ ★

జీవితాన్ని బాగా అర్థం చేసుకోవాలి ! జీవిత శాస్త్రాన్ని తెలుసుకోవాలి ! కర్మ సిద్ధాంతాన్ని తెలుసుకోవాలి ! ఆత్మ సిద్ధాంతాన్ని తెలుసుకోవాలి ! మరి ఆరోగ్య సిద్ధాంతాలను తెలుసుకోవాలి ! దుఃఖ రాహిత్య సిద్ధాంతాలను తెలుసుకోవాలి ! ఇదంతా పెద్ద మహా **భాగవతం** ఏమీ కాదు, మిత్రులారా ! కేవలం సూక్ష్మమైన విషయాలు ! " సూక్ష్మం లోనే మోక్షం " కదా !

సూక్ష్మమైన విషయాలు మూడు ! మళ్ళీ మళ్ళీ శ్రవణం చేయవల్సినవి. మళ్ళీ మళ్ళీ మననం చేయవల్సినవి ఇవే. నిధిధ్యాసన అంటే అభ్యాసంలోకి తెచ్చుకోవల్సింది ఇవే ! సాక్షాత్కారం గావించు కోవల్సినవి ఇవే ! మూడే మూడు సత్యాలు. మొట్టమొదటిది పాపాల వల్లనే రోగాలు సంభవిస్తున్నాయి. రెండవది మన పుణ్యాల వల్లనే మన భోగాలు.

మూడవది... మన ధ్యానం వల్లనే మన జ్ఞానం ! ఎవరి వాస్తవాన్ని వాళ్ళే సృష్టించుకుంటున్నారు, మిత్రులారా ! మన వాస్తవాన్ని ఏ డాక్టరూ మార్చలేడు. ఏ డాక్టర్ల దగ్గరకూ పోవద్దు ! ఏ మందులూ పుచ్చుకోవద్దు ! హింసను మానేద్దాం. " హింసా ఛోడేంగే ! ఔర్ హంసా పకడేంగే ! " హింసను వదలి పెట్టేద్దాం. హంసను పట్టుకుందాం, శ్వాసను పట్టుకుందాం ఇతోధికంగా ! మరి పుణ్య కార్యక్రమాలు ఒకవైపు చేస్తూ, ఇంకొక ప్రక్కన ధ్యాన కార్యక్రమాలను మనం అభ్యాసం చేద్దాం.

ఈ జన్మను ఆఖరి జన్మగా చేసుకుందాం మిత్రులారా ! అందరూ కూడానూ యోగీశ్వరులు కావలె ! ధ్యానేశ్వరులు కావలె! జ్ఞానేశ్వరులు కావలె !

# “ అంతా మధురం ! ”

# " అంతా మధురం ! "

ధ్యాన మిత్రులారా ! ఆత్మ బంధువులారా !

జీవితం ఎంతటి మధురమైన అనుభవమో ఆత్మజ్ఞానులకు. జీవితంలో ప్రతీదీ మధురమే !

చంద్రుడు మధురం ! సూర్యుడు మధురం ! ఎండ మధురం ! వాన మధురం ! చూసే కళ్ళను బట్టి చూడబడేది ఉంటుంది. ఆత్మజ్ఞానులకు జననం మధురం ! మరి మరణం కూడా మధురం ! మానం కూడా మధురం ! అవమానం కూడా మధురం. అన్నీ మధురాలే ! ఎందుకంటే చావు అంటే శరీరం వదలిపెట్టి పోవడమే అని తెలుసుకున్నవాడు గనుక.

ఈ విధంగా ఒకానొక ఆత్మజ్ఞాని యొక్క రీతి, తీరు తెన్నులు మనం తెలుసుకుందాం.

ఆత్మజ్ఞాని యొక్క జీవన విధానం ఎంతటి మధురమో ! ఎంతటి అద్భుతమో ! తెలుసుకుందాం –

" మధురం ! మధురం ! అంతా మధురం !  
మధురం ! మధురం ! సర్వం మధురం !  
పుష్పం మధురం ! మధువు మధురం !  
దేహం మధురం ! ఆత్మ మధురం ! "

మిత్రులారా ! యోగులకు అంతా మధురం. మనిషి దేహ శరీరం కానే కాదు ! ఎప్పుడు తెలుసుకుంటారో ఈ మానవాళి అంతా ! భగవద్గీతను అర్థం చేసుకోలేరు. ఏసు ప్రభువును అర్థం చేసుకోలేరు. ఏ యొక్క యోగినీ అర్థం చేసుకోలేరు. మరి దుఃఖమే కదా అర్థం చేసుకోలేకపోతే ! యోగి అయితే మరి జీవితం అంతా ఆనందమే కదా !

**" జననం మధురం ! మరణం మధురం !**
**యోగం మధురం ! వియోగం మధురం ! "**

మిత్రులారా ! జననమంటే... ఆత్మ పదార్థం అన్నది శరీర పదార్థంలో చేరడం. మరణమంటే... చేరిన పదార్థం తిరిగి వదలి పెట్టేసి వెళ్ళిపోవడం ! వచ్చుట పోవటయే కదా జననము – మరణము ! ఇది తెలుసుకుంటే జీవితమంతా మధురమే !

" హతోవా ప్రాప్స్యసి స్వర్గం " అన్నాడు కదా భగవద్గీతలో శ్రీకృష్ణుడు. చనిపోయిన తర్వాత మనం స్వర్గలోకవాసులమవుతాం. భూలోకవాసులం కాక ముందు మనం అచ్చంగా స్వర్గలోక వాసులం. భూలోకం తరువాత మనం మళ్ళీ స్వర్గలోకవాసులమవుతాం. ఎంతటి మధురం మరి ఇది !

జననమంటే యోగం – మరణమంటే వియోగం... యోగం అంటే కలవడం – వియోగ మంటే విడివడడం కదా ! జననమంటే శరీర పదార్థం మరి ఆత్మ పదార్థం రెండూ కలవడం – మరణమంటే కలిసిన రెండూ విడివడడం !

మిత్రులారా ! మనం అనేక జన్మలు తీసుకుంటాం. ఒక జన్మలో రాజుగా, జమీందారుగా, ఇంకొక జన్మలో పేదగా, రైతుగా జీవిస్తాం ! అన్ని జన్మలూ అద్భుతమైనవే !

**" కలిమి మధురం ! లేమి మధురం !**
**మానం మధురం ! అవమానం మధురం ! "**

యోగులకు అవమానం కూడా మధురమే ! అవమానం అన్నది అవమానం కాదు. అదొక అనుభవం. సత్యహరిశ్చంద్రుడి యొక్క జీవితం మనకంతా ఎంతటి ఆదర్శప్రాయమో ! అదేవిధంగా పాండవుల జీవితం, సీతారాముల జీవితం... ఎంతటి అవమానాలను సహించిన జీవితాలో కదా !

**" స్నేహం మధురం ! బంధం మధురం !**
**నిత్యం మధురం ! అనిత్యం మధురం ! "**

" జీవితమంటే బంధాలే " అనుకుంటారు. కానీ బంధం బంధం కాదు. ఏరుకుని, కూర్చుకుని మనం పుట్టాం – " ఎవరితో జీవించాలి ? ఎక్కడ పుట్టాలి ? ఎవరితో పరిణయమాడాలి ? ఎవర్ని పుట్టించాలి ?..." ఇవన్నీ కూడానూ ఆత్మపరమైన చక్కటి మేలు కూర్చే శుభకర ఎన్నికలు మిత్రులారా !

ఈ బంధాలు... ఇహలోకం... ఈ అనిత్యమైన వస్తువులు మనకు **అమధురం** అనుకుంటున్నారేమో ! నిత్యం అన్నది మధురం, మరి అనిత్యం కూడా మధురం ! స్నేహం నిత్యమైనది. బంధం అనిత్యమైనది. రెండూ కూడా మరి సరిసమానంగా మధురాలే !

మిత్రులారా ! ఒకానొక ఆత్మ యొక్క ప్రాపంచిక జీవితం, లేదా భౌతిక జీవితం అన్నది నాలుగు విధాలుగా విభజింపబడింది : కామం, అర్థం, ధర్మం, మోక్షం.

**" కామం మధురం ! అర్థం మధురం !**
**ధర్మం మధురం ! మోక్షం మధురం ! "**

ఆత్మ యొక్క కోరికలను చతుర్విధ పురుషార్థాలన్నారు.

కామం, అర్థం, ధర్మం, మోక్షం... మోక్షం అన్నది కామానికి విరుద్ధం కాదు... కామం అన్నది మోక్షానికి విరుద్ధం కాదు ! అయితే ధర్మయుతమైన... అంటే అహింసాయుతమైన... పరస్పర అంగీకార... కామముండవలె...! అదే విధంగా ధర్మయుతమైన అర్థముండవలె ! ఈ విధంగా జీవితం మధురాలమయం కదా... ఆత్మజ్ఞానికి ! ఆత్మజ్ఞానం లేనివారికి మాత్రం మరి జీవితం దుఃఖాల మయం !

గౌతమ బుద్ధుడు ఎక్కడ చూసినా దుఃఖం చూసాడు. ప్రపంచమంతా దుఃఖంలో ఉంది. ఎందుకంటే... మరి ధ్యానం లేదు కనుక. ఆత్మజ్ఞానం శూన్యమయ్యింది కనుక. బుద్ధి అసలే లేదు కనుక ! ఎక్కడైతే ధ్యానముంటుందో, ఆత్మజ్ఞానం యొక్క అనుభవముంటుందో, బుద్ధి యొక్క పరి విశేషముంటుందో... అక్కడ ఎప్పుడూ మధురమే చూస్తాం.

మానవ జీవితం వాస్తవానికి మధురాల మయం !

" గానం మధురం ! ధ్యానం మధురం !
త్రినేత్రం మధురం ! ఆత్మయానం మధురం ! "

అందరూ కూడానూ ధ్యానులు కావలె ! మూడవ నేత్రాన్ని ఉత్తేజపరచుకొనవలె! త్రినేత్రులు కావలె ! ఆత్మతో యానం చేయవలె ! ఆత్మయానులు కావలె !

" మధురం ! మధురం ! సర్వం మధురం !
మధురం ! మధురం ! మధురాతిమధురం ! "

# " నాలుగు పదార్థాలు ! "

# " నాలుగు పదార్థాలు ! "

**మా**స్టర్స్ అందరికీ, భగవంతులందరికీ, ఈ యొక్క భగవంతుడు నమస్కారం చేస్తూ.... ఈ రోజు తిరిగి మన ఆత్మ యొక్క సమాచారాన్ని ఒకరికొకరు పంచుకుందాం.

మనమందరం కూడానూ అత్యంత గొప్పదైన ఆత్మపదార్థం ! అయితే మనం దేహపదార్థం మాత్రమే అని అనుకుంటున్నాం. ' మనం ఈ దేహపదార్థంతో పాటు ఆత్మ పదార్థం కూడా ' అని తెలుసుకోవడం వల్ల అనుక్షణం జీవితంలో ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటాం.

" ఎవరైతే తాము ఆత్మ పదార్థం అని తెలుసుకోజాలరో, తెలుసుకోవడానికి ఇచ్ఛగించరో... వాళ్ళు ఎప్పుడూ అశాంతితో, అనారోగ్యంతో ఉంటారు. అసలైన జీవిత సూత్రం ఏమిటంటే ప్రతిక్షణమూ మనం 'ఆనందంగా ఉండాలి. మనం వెంటపడవలసినది ధనం వెంటకాదు ! కీర్తి వెంట కాదు ! ఆనందం వెంట పడాలి !

" **ఆనందంతో జీవించాలి** అన్నది అసలైన సిసలైన జీవిత సూత్రం. మరి ఈ ఆనందం అనేది ఆత్మ పదార్థాన్ని తెలుసుకోకపోతే దొరకదు. ఆనంద సూత్రమే ఆరోగ్య సూత్రం ! ఆనందసూత్రమే ప్రగతి సూత్రం ! ఆత్మ పదార్థాన్ని తెలుసుకున్న వాళ్ళే ఆనంద సూత్రాన్ని తెలుసుకున్నవాళ్ళు.

" జీసస్ క్రైస్ట్ అన్నాడు, 'My father is in heaven ! ఇక్కడున్న తల్లి నా తల్లి కాదు.' ఇక్కడున్న తండ్రి నా తండ్రి కాదు. చూశారా ! ఈ ఆత్మ పదార్థం అక్కడున్న ఆత్మ పదార్థం నుంచి వచ్చింది. "

## " మనం నాలుగు పదార్థాలు "

" మనం నాలుగు పదార్థాలు ! మనం ఒక దేహ పదార్థం. మనం ఒక మనో పదార్థం. మనం ఒక బుద్ధి పదార్థం. మనం ఒక ఆత్మ పదార్థం. నా ఈ దేహ పదార్థం నా తల్లిదండ్రుల దేహ పదార్థం నుంచి నాకు వచ్చింది. మీ దేహ పదార్థం మీ తల్లిదండ్రుల దగ్గరనుంచి వచ్చింది.

" అలాగే మీ దగ్గర ఒక మనో పదార్థం ఉంది. అది మీరు పుట్టి పెరిగిన సమాజం యొక్క మనోపదార్థం యొక్క దర్పణం. మీరు హిందువుల్లో పుడితే ఒక రకమైన మనో పదార్థం ఉంటుంది. అదే మీరు ముస్లిం గా పుడితే మీ దగ్గర ఇంకొక రకమైన మనో పదార్థం ఉంటుంది. మీరు క్రిస్టియన్‌గా, కమ్యూనిస్ట్ గా పుడితే మీ దగ్గర వేరే రకమైన మనో పదార్థం ఉంటుంది.

" మీరు ఏ సమాజంలో పుట్టి పెరిగారో ఆ సమాజానికి దర్పణం పట్టే మనోపదార్థం మీ దగ్గర ఉంటుంది. నేను హిందువునీ అంటారు. నేను ముస్లిమ్‌ని అంటారు. కనుక ఈ మనో పదార్థాన్ని మీ యొక్క సమాజ మనో పదార్థం నుంచి పుణికి పుచ్చుకున్నారు. మీ దేహ పదార్థాన్ని మీ తల్లిదండ్రుల దేహ పదార్థం నుంచి పుణికి పుచ్చుకున్నారు. "

## " బుద్ధి పదార్థం "

మూడవది ఏంటంటే... బుద్ధి పదార్థం. ఈ బుద్ధి పధ్ధార్థం అనేది మీకు అనేక గత జన్మల సంస్కారం నుంచి వచ్చింది. ఉదాహరణకు ఒక మనిషి ఒక పది జన్మలు ఎత్తాడనుకుందాం... కొద్దిగా బుద్ధి ఉంటుంది. పది జన్మల సారం అది. ఇంకో మనిషి యాభై జన్మలు ఎత్తాడనుకుందాం... అతనికి కొంచెం బుద్ధి ఎక్కువగా ఉంటుంది. యాభై జన్మల సారం అది. ఇంకొక మనిషి వెయ్యి జన్మలు ఎత్తాడనుకుందాం... ఆ వెయ్యి జన్మల నుంచి తెచ్చుకునే బుద్ధి అత్యంత ఎక్కువ పాళ్ళల్లో వుంటుంది.

" గత జన్మల్లో మనం బాగా ధ్యాన సాధన చేసి ఉంటే, ఆత్మ జ్ఞానం సంపాదించి ఉంటే మనం ఎంతో జ్ఞానవంతులుగానే పుడతాం. పుట్టుకతోనే ఆ జ్ఞానం వస్తుంది.

**పుట్టుకతో** ఎందుకు వచ్చిందీ ? అంటే అది గత జన్మల సారం కాబట్టి. శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ... పుట్టుకతోనే సంగీతంతో పుట్టాడాయన. ఆయన ఐదు ఏళ్ళకే సంగీత కచేరీ చేశారు. ఎలా చేయగలిగాడు ? గత జన్మల నుంచి ఆ బుద్ధి విశేషం వచ్చింది ! "

## " గౌతమ బుద్ధుడు "

" గౌతమ బుద్ధుడు ఒక చావును చూడగానే తాను చనిపోయాడు. ఒక ముసలివాడిని చూడగానే తాను ముసలివాడు అయిపోయాడు. ఒక రోగిని చూడగానే తాను రోగగ్రస్తుడై పోయాడు. ఒక సన్యాసిని చూడగానే తాను సన్యాసి అయ్యాడు. ఆయనకు అంతటి బుద్ధివిశేషం ఎక్కడి నుంచి వచ్చింది ? ఆయన గత జన్మల నుంచి వచ్చిన బుద్ధి విశేషం అది !

" మనం ఇన్ని చావులు చూస్తున్నా మనం చావడం లేదు . ఎన్ని రోగాలు చూసినా మనం రోగగ్రస్తులం కావడం లేదు ! మనకు ఆ తపన లేదు. **ఆ ! ఇది మామూలే !** అని మనం కూడా రోగాలు తెచ్చుకుంటున్నాం. మనం బుద్ధి పదార్థాన్ని గత జన్మల నుంచి తెచ్చుకుంటున్నాం ! "

" తల్లిదండ్రుల నుంచి మన దేహపదార్థాన్ని తెచ్చుకుంటున్నాం. మనోపదార్థాన్ని పుట్టి పెరిగిన సమాజం నుంచి అరువు తెచ్చుకుంటున్నాం. సృష్టికర్త దగ్గరి నుంచి ఆత్మ పదార్థం తెచ్చుకుంటున్నాం. నేను అనే పదార్థం ఆత్మ పదార్థాన్ని సృష్టికర్త దగ్గర నుంచి తెచ్చుకుంటున్నాం. "

## " ఆత్మపదార్థం అందరికీ ఒక్కటే ! "

" నాలుగు పదార్థాలు : దేహ పదార్థం, మనో పదార్థం, బుద్ధి పదార్థం, ఆత్మ పదార్థం. దేహ పదార్థం అందరికీ వేరే వేరే ! మనో పదార్థం వేరే వేరే ! బుద్ధి పదార్థం కూడా వేరే వేరే ! కానీ ఆత్మపదార్థం అందరికీ ఒక్కటే ! అక్కడ మనం ఏకమై ఉన్నాం. మిగతా మూడు చోట్ల పరిపరివిధాలుగా ఉన్నాం. కనుక ఆత్మ పదార్థానికి ఎవరైతే చేరుకుంటారో వారి జీవితంలోనే ఆనందం. వారి జీవితంలోనే ఆరోగ్యం.

" ఈ యొక్క ఆత్మ పదార్థానికి మనం చేరువ చేరాలంటే మన యొక్క మనోపదార్థం జీరో కావాలి తాత్కాలికంగా ! ఎప్పుడైతే మనోపదార్థం తాత్కాలికంగా జీరో అయిందో అప్పుడు **నేనొక హిందువు** అని, **నేనొక ముస్లిమ్** అని, **నేనొక స్త్రీ** అని, **నేనొక పురుషుడిని** అని మొత్తంగా మన మెదడుల్లోంచి తీసివేస్తాం.

" అవన్నీ తీసివేసినప్పుడు... మనోపదార్థం ఖాళీ అయినప్పుడు... అప్పుడు ఆత్మ పదార్థం... మబ్బులు వీడితే సూర్యుడు కనబడినట్లు, భాసిస్తుంది ! మబ్బుల వెనకాల సూర్యుడు ఉన్నట్లు, మబ్బుల వెనకాల చంద్రుడు ఉన్నట్లు మనో పదార్థం వెనకాల ఆత్మపదార్థం ఉంది. మనకు మన మనోపదార్థం మాత్రమే కనబడుతోంది. కానీ ఆత్మ పదార్థం కనబడటం లేదు. మబ్బులే కనబడుతున్నాయి కానీ సూర్యుడు, చంద్రుడు, కనబడటం లేదు. ఆ మబ్బులను ప్రక్కకు తొలగిస్తేనే మన సూర్యుడు మనకు సువిదితమవుతాడు. మబ్బులను, మనో పదార్థపు మబ్బులను కరిగించవలె ! ప్రక్కకు తొలగించవలె ! "

## "చిత్తవృత్తి నిరోధం"

" **యోగఃచిత్తవృత్తి నిరోధః** అంటే ఆ మబ్బులను కరిగించటమే ! చిత్తవృత్తి నిరోధమే యోగం యొక్క లక్ష్యం ! ఆత్మ సూర్యుడిని మనం ప్రత్యేకంగా తీసుకుని రావక్కరలేదు. మనం ఆత్మయే అయివున్నాం. కానీ మనోపదార్థమే మనకంటికి తెరలా ఉంది. పచ్చకామెర్లవాడికి లోకమంతా అలాగే కనబడుతుంది.

" హిందువుగా ఉన్నవాడికి ముస్లిమ్ చెడ్డగా కనబడతాడు. ముస్లింగా వున్నవాడికి హిందువు చెడ్డగా కనబడతాడు. జమీందారు వెళ్ళుతున్నప్పుడు పాకలో ఉన్నవాళ్ళని చూసి ఛ! వీళ్ళంతా రోడ్డుకు అడ్డంగా ఉన్నారు. పాకలన్నీ తీసి పడెయ్యండి అంటాడు. పాకలో ఉన్నవారు ఏమంటారు ! ఈ జమీందారుని చంపెయ్యండి అంటారు. " మాకు ఇక్కడ రొట్టె కూడా లేదు. వాడు కాఘులో తిరుగుతాడా ? ఇదేనా భగవంతుని న్యాయం ? వాడిని చంపెయ్యండి " అంటారు. ఎవరు కరెక్టు ? వాళ్ళ వైపు నుంచి వాళ్ళు కరెక్టు ! వీడి వైపు నుంచి వీడు కరెక్టు ! ఇద్దరూ కరెక్టే ! ఇద్దరూ కరెక్ట్ అయినప్పుడు కొట్లాటలు వస్తాయి. మగాడి క్రింద పడుండాలా ? అని ఆడది. ఆడది పడుండాలి అని మగాడు అంటాడు. అత్త వైపు నుంచి అత్త కరెక్టు. కోడలి వైపు నుంచి కోడలు

కరెక్టు. కానీ వ్యతిరేకం కనుక ఘర్షణ తప్పదు. మనోపదార్థంలో ఉన్నవారందరికీ ఘర్షణ తప్పదు. రకరకాల బుద్ధి పదార్థంతో ఉన్నవారికీ ఘర్షణలు తప్పవు.

## " తిట్టుకో ! "

" అంతా తానే అయిఉన్న ఆత్మ పదార్థంలో ఉన్న బుద్ధుడిని ఎవరైనా వచ్చి **నేను నిన్ను చంపుతా** ! అంటే **చంపు** అంటాడు. బుద్ధుడు కొట్లాడడు. కృష్ణుడిని శిశుపాలుడు తిడుతూనే వున్నాడు. ఈగవాలినట్లు కూడా ఆయనకు లేదు. తొంభై తొమ్మిది సార్లు తిట్టాడు. తిట్టి తిట్టి పోశాడు. **తిట్టుకో** అన్నాడు. అదే ఇంకోడైతే వెంటనే కయ్యానికి కాలు దువ్వేవాడు. వందోసారి తల తీసేసాడంటే ఏమాత్రం చింత లేకుండా తొంభై తొమ్మిది సార్లు అవమానం భరించాడు. ఏ మాత్రం చింతలేకుండా ఆ తల తీసేశాడు. కనుక ఆ విధమైన స్థితి కలిగిన కృష్ణుడు ఆత్మోన్నతి కగిలిన వాడు. ఆత్మ యొక్క పదార్థాన్ని తిన్నవారు మనం ఇడ్లీపిండి రుబ్బి ఇడ్లీ ఎలా తింటామో అలా ఆత్మ పదార్థాన్ని తిన్నవాడు కృష్ణుడు, బుద్ధుడు, జీసెస్‌క్రైస్ట్ కనుకనే వాళ్ళు మనకు ఆదర్శ పురుషులుగా ఉన్నారు. మనం కూడా వాళ్ళలాగా ఇడ్లీపిండి రుబ్బి, ఇడ్లీ వండి పచ్చడి, నెయ్యి వేసుకుని తినాలి... ఆధ్యాత్మిక ఇడ్లీ, ధ్యానపు పచ్చడి, ఆత్మ పదార్థపు నెయ్యి.

" ఈ మనో పదార్థం నుంచి ఆత్మపదార్థం వైపు వెళ్ళాలంటే దానికి మార్గమే శ్వాస మీద ధ్యాస ఆనాపానసతి ! "

## " బ్రహ్మ రహస్యం ! "

" అత్యంత గొప్పదైన పదార్థాన్ని బ్రహ్మ పదార్థం అంటాం ! అత్యంత గొప్ప ఋషిని ఏమంటాం ? బ్రహ్మర్షి అంటాం ! చూశారా... బ్రహ్మ అంటే అత్యంత గొప్ప. బ్రహ్మ రహస్యం అంటే ... దాని పేరే " ఆనాపానసతి ".

" **ఆన** అంటే ఉఛ్వాస... **అపాన** అంటే నిశ్వాస ... **సతి** అంటే కూడుకుని ఉండడం. మన ఉచ్ఛ్వాస నిశ్వాసలతో మనం కూడుకుని ఉండడం. ఇదే బ్రహ్మ రహస్యం !

" ఈ బ్రహ్మ రహస్యాన్ని ఉపయోగించుకున్నవాళ్ళు బ్రహ్మ పదార్థం అవుతారు. ఆత్మ పదార్థం అవుతారు. శాశ్వతంగా ఆనందులౌతారు. శాశ్వతంగా ఆరోగ్యవంతులౌతారు. శాశ్వతంగా జ్ఞానులౌతారు. ఇంక మళ్ళీ మనస్సనే మబ్బులు ఆ సూర్యుణ్ణి కప్పవు. ఆత్మ సూర్యుడు ఎప్పుడూ దేదీప్యమానంగా విరాజిల్లుతూ ఉంటాడు. ఆ బుద్ధి చంద్రుడు ఎప్పుడు దేదీప్యమానంగా వెలుగుతూ ఉంటాడు.

" శ్రీకృష్ణుని యొక్క ఆత్మ సూర్యుడిని మనో మబ్బులు కమ్మలేదు. రుక్మిణి యొక్క ఆత్మ సూర్యుడిని మనో మబ్బులు కమ్మలేవు. రమణమహర్షి యొక్క ఆత్మ సూర్యుడికి మబ్బులు కమ్మవు. ఎందుకంటే ఆ మనస్సు మబ్బులను కరిగించేశారు వాళ్ళు. మనోపదార్థాన్ని కరిగించేశారు. వాళ్ళను **నువ్వు హిందువు** అంటే పకపకా నవ్వుతారు, **నువ్వు పురుషుడివి** అంటే పకపకా నవ్వుతారు ! **నువ్వు స్త్రీ** అంటే పక పకా నవ్వుతారు !

" నేను స్త్రీ కాదు, పురుషుడు కాదు ; హిందువు కాదు ముస్లిమ్ కాదు ; నేను బ్రహ్మ పదార్థం ; అంతటా ఉన్నది నేనే, అని తెలుసుకున్న వాడికి ఇంకేం కారుమబ్బులు ? ఏ తాళం కప్పకు ఆ తాళం చెవి ఉంటుంది. ఒక తాళం కప్పకు వేరే తాళం చెవి పెడితే అది రాదు. అలాగే బ్రహ్మజ్ఞానానికి బ్రహ్మరహస్యం... దాని పేరు పాళీ భాషలో ఆనాపానసతి, తెలుగులో శ్వాస మీద ధ్యాస ! "

## " కట్టె, కొట్టె, తెచ్చె ! "

వాల్మీకి గొప్ప ఋషి. మానవాళి అందరికీ ఒక మంచి కావ్యం వ్రాయాలి అని సంకల్పించుకుని రామాయణం వ్రాశాడు. ఆయన తన మైండ్ లోంచి ఒక రాముణ్ణీ, ఒక సుగ్రీవుణ్ణీ, ఒక హనుమంతుడ్నీ సృష్టించి చక్కని కావ్యాన్ని వ్రాసి, అందరికీ చక్క చక్కటి పేర్లు పెట్టి చక్కగా కథ వ్రాశాడు. ప్రజలను రంజింప చేయడానికి వాల్మీకి ఎలా చెప్పాడో చిన్నగా చూద్దాం... కట్టె, కొట్టె, తెచ్చె !

" ఈ శరీరం అనబడే కట్టెను కట్టేసేయాలి. మనస్సును కొట్టాలి. ఆత్మజ్ఞానాన్ని తెచ్చుకోవాలి. చూశారా... ఈ శరీరాన్ని కట్టేయాలి. ఒక కాలుని రెండవ కాలితో కట్టేయాలి. ఒక చేతిని రెండవ చేతితో కట్టేయాలి. ఒక పెదవిని పెదవితో కట్టేయాలి.

కనుగుడ్లను కనురెప్పలతో కట్టేయాలి. ఇక మనస్సుంటుంది. మనస్సుని కొట్టాలి. అప్పుడు ఆత్మను తెచ్చుకుంటాం. "

## " వాయుపుత్రుడు "

" వాయుపుత్రుడు " అంటే ఆనాపానసతి అభ్యాసం చేసేవాడు. ఎవరైతే ఆనాపానసతి అభ్యాసం చెయ్యరో వాళ్ళంతా వానరులు, కోతి మూక ! ఎవరైతే ఆనాపానసతి అభ్యాసం చేస్తారో వాళ్ళంతా ఆంజనేయస్వాములౌతారు. స్వామి అంటే మాస్టర్. ఆంజనేయ అంటే అంజనం ఉన్నవాడు. అంటే మూడవ కన్ను ఉన్న మాస్టర్ ! ఎవరైతే ధ్యానాభ్యాసం చేస్తారో వాళ్ళంతా ఆంజనేయస్వాములు అవుతారు. ఎవరైతే ధ్యానాభ్యాసం చెయ్యరో వాళ్ళంతా కోతులు, మర్కటాలు, చూశారా ఎంత చక్కగా ఆయన కథ అల్లి చెప్పారో !

" **హనుమాన్ చాలీసా** అంటే ఎవరైనాసరే 40 రోజుల పాటు ఏకదీక్షతో వాయుపుత్రులైతే ఆంజనేయస్వాములవుతారు. వాయుపుత్రడి తోనే సుందరాకాండ. జీవితంలో సుందరమైన కాండ మనోహరమైన కాండ ధ్యానం చేసిన తరువాతే మొదలవుతుంది. అంతకు ముందు కాదు. లంకా దహనం చేస్తాడు వాయుపుత్రుడు. ఎప్పుడైతే ధ్యాన సాధన చేస్తామో అప్పుడు **నేను వేరే నువ్వు వేరే** అనే ఆ లంకాతత్వం దహనమైపోతుంది. **అంతా నేనే** అనే తత్త్వం వస్తుంది.

" కొండ ఎత్తగలడు ఆంజనేయస్వామి ! ఎప్పుడైతే మనం ధ్యానాభ్యాసం చేస్తామో ఎలాంటి పనులైనా అవలీలగా చేయగలం. అదీ ఎత్తడం అంటే. సంజీవని అంటే ఇదే ! ఆరోగ్యాన్నిచ్చే విద్య ఆనాపానసతే సంజీవనీ విద్య !

## " దశరథుడు అంటే జీవుడు "

" కుంభకర్ణుడు తమోగుణానికి ప్రతీక. రావణాసురుడు రజో గుణానికి ప్రతీక. విభీషణుడు సాత్విక గుణానికి ప్రతీక. రాముడు నిర్గుణానికి ప్రతీక. కుంభకర్ణుడు ఎప్పుడూ తిని త్రాగుతూ ఉంటాడు. ఆర్నెల్లు తింటాడు. ఆరునెల్లు పడుకుంటాడు. అదే తమోగుణం. రావణాసురుడికి ... అందరూ వాడి క్రింద ఉండాలని అంటాడు.

అదే రజోగుణం. విభీషణుడు ఏది మంచి ? ఏది చెడు ? అంటూంటాడు. ఎటు మంచి ఉంటే అటు వెళతాడు ! అతనికి తన కుటుంబం కాదు. కుటుంబం చెడ్డదైతే తన కుటుంబాన్ని వదిలి పెట్టేస్తాడు. మంచి వైపు వెళతాడు. అది విభీషణుడు. "

" **దశరథుడు** – దశ అంటే పది, రథుడు అంటే రథాలు. అయోధ్య అంటే యుద్ధంతో కూడా జయించలేనటువంటిది. ఈ శరీరం అయోధ్య. ఈ శరీరంలో జీవుడు ఐదు కర్మేంద్రియాలతో, ఐదు జ్ఞానేంద్రియాలతో నివసిస్తున్నాడు. జీవుడికి మూడు గుణాలు ఉన్నాయి.

" **దశరథుడు** అంటే జీవుడు. జీవుడు ఈ శరీరంలో ఐదు జ్ఞానేంద్రియాలతో, ఐదు కర్మేంద్రియాలతో పరిపాలిస్తూండగా అతనికి ముగ్గురు భార్యలు అంటే మూడు గుణాలు. కౌసల్య సాత్విక గుణం... సుమిత్ర తమోగుణం, కైక రజోగుణం. కౌసల్యా పుత్రుడు సాత్వికం నుంచి వచ్చిన నిర్గుణం. తన మస్తిష్కం నుంచి వాల్మీకి మాట్లాడం ఎంత చక్కగా ఈ యొక్క పాత్రలను సృష్టించాడో ! రామాయణంలో ఆయన సృష్టించిన పాత్రలకే మనం గుళ్ళు కట్టాం. వాల్మీకికి గుడులు కట్టలేదు.

" వేదవ్యాసుడి మస్తిష్కంలో నుంచి వచ్చిన కృష్ణుడికి గుడులు కట్టాం... వేదవ్యాసుడికి కట్టలేదు. అసలు అక్కడ వేదవ్యాసుడే హీరో ! మిగతా వాళ్ళంతా వేదవ్యాసుడు సృష్టించిన పాత్రలు ! మన బుద్ధి అలా తగలడింది. మూర్ఖత్వం ప్రచండంగా విరాజిల్లి అలాగే వ్రేళ్ళూని ఉంది. ఈ మూర్ఖత్వాన్నంతా మనం తీసేసి తిరిగి మనం వేదవ్యాసులం కావలె ! వాల్మీకులం కావలె ! "


## " సింహం పిల్ల సింహమే !"

" దేహ పదార్థం మనకు తల్లిదండ్రుల నుంచి వచ్చింది. మనో పదార్థం సమాజం దగ్గర నుంచి, బుద్ధి పదార్థం గత జన్మల నుంచి, ఆత్మ పదార్థం సృష్టికర్త దగ్గరి నుంచి. సింహం పిల్ల సింహం అవుతుందా ? మేక అవుతుందా ? మరి భగవంతుడి పిల్లలు భగవంతులవుతారా ? మానవులవుతారా ? కనుక మనమందరం భగవంతులం.

" చిన్న పిల్లి పిల్ల కూడా పుట్టి పెరిగిన తరువాత ఏమవుతుంది ? చిన్న భగవంతుడు పుట్టి పెరిగి ఏమవుతాడు ? పూర్తి భగవంతుడవుతాడు !

" మనం పిల్ల భగవంతులం ! ఎన్నో జన్మల్లో పెరిగి పెరిగి ధ్యానం చేసి చేసి ఆత్మజ్ఞానం సంపాదించుకుని పూర్ణ భగవంతులం అవుతాం. చిన్న పిల్లి కాస్తా పెద్దపిల్లి అవుతుంది. చిన్న పులి పుట్టి పెరిగి పెద్ద పులి అవుతుంది. చిన్న భగవంతుడు పుట్టి ఏమవుతాడు ? రాముడు పెద్ద భగవంతుడా ? చిన్న భగవంతుడా ? కృష్ణుడు ? జీసెస్ ? పెద్ద భగవంతుడు. మనం ? చిన్న పిల్ల భగవంతులం.

" కనుక ఈ రోజు నుంచి మనం ధ్యానం చేద్దాం ! ధ్యానమే వాల్మీకి ప్రబోధితం. మనస్సును కొట్టే మార్గమే... శ్వాస మీద ధ్యాస ! ఈ కట్టెను కట్టేసి, మనస్సును కొట్టడానికి మార్గమే... శ్వాస మీద ధ్యాస, ఆనాపానసతి. "



Athma Kshetram

301

MRP Rs. 25.00

www.pyramidvalley.org

Telugu

Rs: 30/-
No: 301

ధ్యాన లహరి పబ్లికేషన్స్